

నేడు జడ్పీ సర్వసభ్య సమావేశం



విశాఖపట్నం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం చైర్‌పర్సన్ అధ్యక్షతన జరగనుందని, ఈ మేరకు ఏర్పాట్లు పూర్తిచేశామని సీఈవో పి.నారాయణ మూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని, అన్ని విభాగాల అధికారులు పూర్తి నివేదికలతో హాజరు కావాలన్నారు.

స్వచ్ఛాంధ్ర పురస్కారాలు

జిల్లాలో ఐదు విభాగాలకు రాష్ట్రస్థాయి అవార్డులు

- 45 విభాగాలకు జిల్లాస్థాయిలో..
- ఆరో తేదీన సీఎం చేతుల మీదుగా ప్రదానం

అనకాపల్లి, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం స్వచ్ఛ భారత్ లక్ష్యానికి అనుగుణంగా ముందుకు సాగుతున్నది. కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏడాది అందిస్తున్న స్వచ్ఛ సర్వేక్షణ్ పురస్కారాల తరహాలో రాష్ట్రస్థాయిలో స్వచ్ఛ ఆంధ్ర పురస్కారాలను వివిధ విభాగాలకు అందజేయనున్నది. ఐదు విభాగాల్లో అనకాపల్లి జిల్లాకు రాష్ట్రస్థాయి పురస్కారాలు వరించాయి. జిల్లాస్థాయిలో వివిధ విభాగాలకు 45 పురస్కారాలు దక్కాయి. రాష్ట్రస్థాయిలో స్వచ్ఛ గ్రామ పంచాయతీ విభాగంలో కె.కోటపాడు మండలం చౌడువాడ ఎంపికైంది. ఇదే గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం స్వచ్ఛ ఆస్పత్రి విభాగంలో రాష్ట్రస్థాయి పురస్కారానికి ఎంపికైంది. స్వచ్ఛ విలేజ్ పురస్కారానికి నాతవరం మండల కేంద్రాన్ని ఎంపిక చేశారు. స్వచ్ఛ ఇండస్ట్రీస్‌గా భారీ పరిశ్రమల విభాగంలో ఏటీసీ టైర్స్ ఏపీ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ, ఎంఎస్ఎంలో సియోనిక్ ఫార్మా కంపెనీ ఎంపికయ్యాయి. విజయవాడలో ఈ నెల 6న సీఎం చంద్రబాబునాయుడు పురస్కారాలను ప్రదానం చేయనున్నట్టు డీపీఓ సందీప్ తెలిపారు.





స్వచ్ఛ మునిసిపాలిటీగా ఎంపికైన నర్సీపట్నం

జిల్లాస్థాయి పురస్కారాలు..

నర్సీపట్నం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలో పలు ప్రభుత్వ విభాగాలు, స్వచ్ఛంద సేవా సంస్థలకు రాష్ట్ర, జిల్లాస్థాయిల్లో అవార్డులు ప్రకటించింది. స్వచ్ఛ మునిసిపాలిటీ అవార్డుకు జిల్లా స్థాయిలో నర్సీపట్నం ఎంపికైంది. నర్సీపట్నం మండలం ధర్మసాగరం, అచ్యుతాపురం మండలం దిబ్బపాలెం, అనకాపల్లి మండలం మార్టూరు, మునగపాక మండలం ఒంపోలు స్వచ్ఛ గ్రామ పంచాయతీలుగా ఎంపికయ్యాయి.

ఉత్తమ గ్రీన్ అంబాసిడర్లుగా అనకాపల్లి మండలం మార్టూరుకుకి చెందిన ఆర్.అప్పారావు, సబ్బవరం మండలం అరిపాకకు చెందిన పి.హరికృష్ణ, కె.కోటపాడు మండలం చౌడువాడకు చెందిన ఎ.అప్పారావు, అచ్యుతాపురం మండలం దిబ్బపాలేనికి చెందిన వి.నూకాలమ్మ, ఎస్.రాయవరం మండలం గుడివాడ పంచాయతీకి చెందిన డి.కాసులు ఎంపికయ్యారు. నర్సీపట్నం మునిసిపాలిటీకి చెందిన మార్తి అప్పారావు, పరవతి బాల, ఎలమంచిలి మునిసిపాలిటీకి చెందిన కందరకోట వెంకటేశ్, గుడబండి వరలక్ష్మి, జీవీఎంసీ అనకాపల్లి జోన్‌లో పని చేస్తున్న కశింకోట గోవింద అప్పలస్వామి ఉత్తమ స్వచ్ఛత వారియర్స్‌గా ఎంపికయ్యారు. స్వచ్ఛ అంగన్‌వాడీ కేంద్రాలుగా సబ్బవరం మండలం అమృతపురం, చోడవరం మండలం చాకిపల్లి, రావికమతం మండలం మేడివాడ, నక్కపల్లి మండలం ఎన్.నర్సాపురం, నర్సీపట్నం మండలం వేములపూడి అవార్డులు కైవసం చేసుకున్నాయి.

చౌడువాడలో సంపద తయారీ కేంద్రంలో వర్మీ కంపోస్టును పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్ ఫొటో)

నర్సీపట్నం మండలం వేములపూడి మోడల్ స్కూల్, కె.కోటపాడు కేజీబీవీ, అనకాపల్లి మండలం గవరపాలెం ఎంపీఎల్, పరవాడ మండలం తాణాం బాలికల ఉన్నత పాఠశాల, నక్కపల్లి మండలం వేంపాడు జడ్పీ ఉన్నత పాఠశాల స్వచ్ఛ అవార్డులకు ఎంపికయ్యాయి. చీడికాడ మండలం చీడిపల్లి, నక్కపల్లి మండలం డొంకాడ, కశింకోట మండలం జి.భీమవరం, మండల కేంద్రమైన గొలుగొండ స్వచ్ఛ గ్రామ సంస్థల అవార్డులు సాధించాయి. అనకాపల్లి ... మిగతా 8వ పేజీలో

పరిశుభ్రతకు చిరునామా చౌడువాడ

కె.కోటపాడు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలో మేజర్ పంచాయతీ చౌడువాడ రాష్ట్రస్థాయిలో స్వచ్ఛ పంచాయతీ-2025 పురస్కారానికి ఎంపికైనట్టు సర్పంచ్ దాడి ఎరుకునాయుడు, కార్యదర్శి పాలూరి సురేశ్‌బాబు తెలిపారు. శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ, గ్రామంలో ప్రతి ఇంటి నుంచి రోజూ తడి, పొడిచెత్తను వేర్వేరుగా సేకరించి, సంపద తయారీ కేంద్రానికి తరలిస్తున్నట్టు చెప్పారు. దీనివల్ల గ్రామంలో ఏ వీధిలో కూడా మచ్చుకైనా చెత్తాచెదారం కనిపించదన్నారు. సంపద కేంద్రంలో తడి చెత్త నుంచి వర్మీ కంపోస్టు తయారు చేసి, రైతులకు విక్రయించడం ద్వారా పంచాయతీకి అదనపు ఆదాయం వస్తున్నట్టు వెల్లడించారు. రాష్ట్రస్థాయిలో ఉత్తమ పంచాయతీలుగా ఎంపిక చేసిన వాటిలో చౌడువాడ ఉండడం తమకు ఎంతో ఆనందంగా వుందన్నారు. ఉత్తరాంధ్రలో ఎంపికైన ఏకైక పంచాయతీ తమది కావడం గర్వంగా వుందని చెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తికి, పంచాయతీ అధికారులు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.



చౌడువాడలో ఇళ్ల నుంచి తడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరిస్తున్న గ్రీన్ అంబాసిడర్లు

రైతులకు విరివిగా రుణాలు ఇవ్వాలి

పీఏసీఎస్‌ల వ్యాపారం పెంపుపై దృష్టి పెట్టండి

- స్పీకర్ అయ్యన్నపాత్రుడు
- సహకార సంఘాల నామినేటెడ్ పాలకవర్గాలకు శిక్షణ



సమావేశంలో మాట్లాడుతున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు. వేదికపై డీసీసీబీ పర్సన్ ఇన్‌చార్జి కోన తాతారావు, ఎమ్మెల్యేలు కేఎస్ఎన్ఎస్ రాజు, బండారు, హౌసింగ్ బోర్డు చైర్మన్ తాతయ్యబాబు

చోడవరం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా చిన్న, సన్నకారు రైతులకు విరివిగా రుణాలు ఇవ్వాలని స్పీకర్ అయ్యన్నపాత్రుడు సూచించారు. ఉమ్మడి జిల్లాలో వివిధ సహకార సంఘాలకు ఇటీవల నియమితులైన (నామినేటెడ్) పాలకవర్గాలకు శుక్రవారం స్థానిక కల్యాణ మండపంలో శిక్షణ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన స్పీకర్ మాట్లాడుతూ, సహకార సంఘాల్లో కొత్తసభ్యులను చేర్పించడంతోపాటు, వ్యాపారాన్ని పెంచడంపై దృష్టి సారించాలని అన్నారు. చైర్మన్లకు ఉండే అధికారాలు, హక్కులు తెలుసుకోవాలని, కార్యదర్శులపై ఆధారపడవద్దని చెప్పారు. గ్రామాల్లో చిరువ్యాపారులకు విరివిగా రుణాలు ఇచ్చి ప్రోత్సహించాలని కోరారు. సహకార సంఘాల ద్వారా ఇచ్చే రుణాలకు తప్పనిసరిగా బీమా ప్రీమియం కట్టించుకోవాలని స్పష్టం చేశారు. రుణం తీసుకున్న వ్యక్తి తిరిగి రుణం చెల్లించకుండా చనిపోతే, అతనిపై ఆధారపడిన కుటుంబం రుణం చెల్లించవలసి వస్తుందని, ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఉన్న ఆస్తులు అమ్ముకోవాల్సి వస్తుందని, అందువల్ల రుణగ్రహీతలందరికీ బీమా చేయించాలని చెప్పారు. రైతులకు అవగాహన కల్పించి బీమా ప్రీమియం వసూలు చేయాలన్నారు. సొంత గూడు లేని సహకార సంఘాలు స్థలం సమకూరిస్తే డీసీసీబీ భవనాలు నిర్మిస్తుందని ఆయన చెప్పారు. సంఘాల ఆధ్వర్యంలో ఎరువులు విక్రయించాలని సూచించారు. జీఎస్టీ సంస్కరణల వల్ల వ్యవసాయ పరికరాల ధరలు తగ్గినందున, వీటి కొనుగోలుకు రుణాలు అందించాలని చెప్పారు.

డీసీసీబీ పర్సన్‌ఇన్‌చార్జి కోన తాతారావు మాట్లాడుతూ, సహకార సంఘాల ద్వారా రైతులకు డ్రోన్లు ఇవ్వనున్నట్టు తెలిపారు. సహకార సంఘాల సభ్య రైతులు సహజంగా మరణిస్తే రూ.2 లక్షలు, ప్రమాదవశాత్తూ మృతిచెందితే రూ.5 లక్షలు పరిహారాన్ని ఇవ్వాలని యోచిస్తున్నామన్నారు. చోడవరం, మాడుగుల ఎమ్మెల్యేలు కేఎస్ఎన్ఎస్ రాజు, బండారు సత్యనారాయణమూర్తిలు మాట్లాడుతూ, సహకార సంఘాల ద్వారా అవినీతికి తావులేకుండా రైతులకు సేవలు అందించాలని కోరారు. జిల్లా టీడీపీ అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం జిల్లాలో 98 సహకార సంఘాల్లో 78 సంఘాలకు పాలకవర్గాలను నియమించిందని, మిగిలిన సంఘాలకు త్వరలోనే పాలకవర్గాలు నియమించనున్నదన్నారు. సమావేశంలో డీసీసీబీ సీఈవో వర్మ, టీడీపీ నాయకులు గూనూరు మల్లునాయుడు, పెదబాబు, జనసేన నాయకులు సిరిపురపు రమేశ్, గూనూరు మూలినాయుడు, మజ్జి గౌరీశంకర్, అన్నవరం చిన్న తదితరులు పాల్గొన్నారు.

దుర్భరంగా పినగాడి-కోటపాడు రోడ్డు

ఇరువైపులా ఆక్రమణలు

- రహదారిపైనే వర్షం నీరు
- రాకపోకలకు వాహనదారుల ఇక్కట్లు
- త్వరగా పాడైపోతున్న రోడ్డు



పినగాడి జంక్షన్ వద్ద ఆక్రమణలు పెరిగిపోవడంతో రహదారిపై వర్షం నీరు భారీగా నిలిచిపోయి చెరువును తలపిస్తున్న దృశ్యం

సబ్బవరం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): పినగాడి నుంచి కె.కోటపాడు వెళ్లే రోడ్డులో మండలంలోని పలు గ్రామాల వద్ద ఇరువైపులా ఆక్రమణల కారణంగా రహదారి ఇరుకుగా మారింది. ఆర్అండ్‌బీకి చెందిన డ్రైనేజీ కాలువలు, గెడ్డ స్థలాలు సైతం కబ్జాకు గురయ్యాయి. రోడ్డుకన్నా మార్జిన్లు ఎత్తుగా వుండడంతో వర్షం నీరు రహదారిపైనే నిలిచిపోయి చెరువులను తలపిస్తున్నది. దీంతో పాదచారులు, ద్విచక్ర వాహనదారులు, ఆటో డ్రైవర్లు ఇబ్బంది పడుతున్నారు. ఈ పరిస్థితి పినగాడి జంక్షన్ నుంచి మొగలిపురం మీదుగా మలునాయుడుపాలెం వరకు కనిపిస్తుంది. మలునాయుడుపాలెం వద్ద డ్రైనేజీ కాలువలు ఆక్రమణకు గురవడంతో మురుగు నీరు, వర్షం నీరు కలసి రోడ్డుపై ప్రవహించి, బురద పేరుకుపోతున్నది.

వర్షం కురిసినప్పుడల్లా రహదారిపై నీరు నిలిచిపోతుండడంతో గోతులు ఏర్పడి, త్వరగా పాడైపోతున్నది. ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి ఆక్రమణలను తొలగించాలని, రహదారికి ఇరువైపులా పూడికలను తొలగించాలని ఈ మార్గంలో రాకపోకలు సాగించే పలు గ్రామాల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.



మలునాయుడుపాలెం వద్ద ఛిద్రమైన రోడ్డు

నాడు... నేడు అదే తీరు!

జిల్లాలో అసంపూర్తిగా పలు పాఠశాలల భవన నిర్మాణాలు

- గత ప్రభుత్వ హయాంలో రూ.250 కోట్లతో 604 పనులు మొదలు
- సాధారణ ఎన్నికలనాటికి రూ.130 కోట్లు మాత్రమే చెల్లింపు
- బిల్లులు అందకపోవడంతో మిగిలిన పనులు ఆపేసిన కాంట్రాక్టర్లు
- భవనాల స్థితిగతులపై ప్రభుత్వానికి నివేదించిన జిల్లా అధికారులు
- ఆరు నెలలు దాటినా కానరాని స్పందన



కె.కోటపాడులో పునాదుల స్థాయిలో ఆగిన జడ్పీ ఉన్నత పాఠశాల అదనపు భవన నిర్మాణం

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

జిల్లాలోని పలు పాఠశాలల్లో గత ప్రభుత్వం చేపట్టిన అదనపు తరగతి గదుల నిర్మాణ పనులు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా వున్నాయి. చేసిన పనులకు సంబంధించి బిల్లులు అందకపోవడంతో కాంట్రాక్టర్లు ఎక్కడికక్కడ పనులు నిలిపివేశారు. ఆయా భవన నిర్మాణాలపై నివేదిక రప్పించుకున్న రాష్ట్ర ప్రభుత్వం.. ఇంతవరకు ఆయా భవన నిర్మాణాలపై ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు.

జిల్లాలో 2022-23 ఆర్థిక సంవత్సరంలో అప్పటి వైసీపీ ప్రభుత్వం నాడు- నేడు కార్యక్రమం కింద 604 పాఠశాలల్లో రూ.250 కోట్లతో వివిధ నిర్మాణ పనులను ప్రారంభించింది. వీటిల్లో అంగన్‌వాడీ కేంద్రాల భవనాలు 68, ప్రాథమిక పాఠశాలల భవనాలు 292, ప్రాథమికోన్నత పాఠశాల భవనాలు 38, ఉన్నత పాఠశాలల్లో అదనపు తరగతి గదులు 187, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 19 అదనపు తరగతి గదుల నిర్మాణ పనులు వున్నాయి. అయితే ఆయా దశల్లో పూర్తయిన పనులకు సంబంధించి కాంట్రాక్టర్లకు అప్పటి పాలకులు బిల్లులు చెల్లించకపోవడంతో పనులు ముందుకు సాగలేదు. మొత్తం మీద గత ఏడాది సాధారణ ఎన్నికల ముందునాటికి రూ.130 కోట్ల బిల్లులు మాత్రమే కాంట్రాక్టర్లకు అందాయి. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత జిల్లాల్లో నాడు-నేడు కార్యక్రమం కింద గత ప్రభుత్వం చేపట్టిన భవన నిర్మాణ పనుల వివరాలు పంపాలని జిల్లా అధికారులను ఆదేశించింది. దీంతో విద్యాశాఖ, సమగ్ర శిక్ష విభాగం ఇంజనీరింగ్ అధికారులు ఈ ఏడాది మార్చిలో వివరాలను ప్రభుత్వానికి నివేదించారు. కానీ ఇంతవరకు దీనిపై ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు. పలు పాఠశాలల్లో భవనాలు ... మిగతా 8వ పేజీలో

ఆర్టీసీకి దసరా ధమాకా

- 90 నుంచి 100 శాతానికిపైగా ఓఆర్
- భవానీ మాలధారుల కోసం విజయవాడకు 31 బస్సులు
- 9 రోజుల్లో నర్సీపట్నం డిపోకి రూ.1.55 కోట్ల ఆదాయం

ప్రయాణికులతో కిక్కిరిసిన బస్సులు



నర్సీపట్నం కాంప్లెక్స్‌లో ఆర్టీసీ బస్సు ఎక్కుతున్న ప్రయాణికులు

నర్సీపట్నం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): దసరా పండగ సందర్భంగా ఆర్టీసీ బస్సులు కిక్కిరిసిపోయాయి. గత నెల 24వ తేదీ నుంచి దసరా వరకు సరాసరి 99 శాతం ఓఆర్ నమోదు అయ్యింది. విజయవాడ వెళ్లే భవానీ మాలధారులు మొత్తం 31 బస్సులను బుక్ చేసుకున్నారు. డిపోలో ఉన్న 97 బస్సుల్లో 31 బస్సులు విజయవాడ వెళ్లి పోవడంతో శుక్రవారం బస్సుల కొరత కారణంగా నర్సీపట్నం నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్లాల్సిన ప్రయాణికులు ఎక్కువ సేపు వేచివున్నారు. దసరా సెలవులు ముగియడంతో తిరుగు ప్రయాణం అయ్యేవారు తగినన్ని బస్సులు అందుబాటులో ఇబ్బంది పడ్డారు. కాగా దసరా సందర్భంగా ... మిగతా 8వ పేజీలో

టీడీపీ నేత స్రవంతికి నామినేటెడ్ పదవి

- శ్రీకాళహస్తి దేవస్థానం ట్రస్టు బోర్డు సభ్యురాలిగా నియామకం



బీలా స్రవంతి

మునగపాక, అక్టోబర్ 3 (ఆంధ్రజ్యోతి): మునగపాకకు చెందిన టీడీపీ మహిళా నేత బీలా స్రవంతికి రాష్ట్రస్థాయి నామినేటెడ్ పదవి దక్కింది. ఆమెను శ్రీకాళహస్తి దేవస్థానం ట్రస్టు బోర్డు సభ్యురాలిగా నియమిస్తూ శుక్రవారం రాత్రి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మునగపాక దళిత కాలనీకి చెందిన స్రవంతి 2016 నుంచి తెలుగుదేశం పార్టీలో క్రియాశీలకంగా ఉన్నారు. జిల్లా ఎస్సీ సెల్ అధికార ప్రతినిధిగా, అనకాపల్లి మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా పనిచేశారు. ఆమె భర్త లక్ష్మణరావు జిల్లా ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శిగా వ్యవహరిస్తున్నారు.

నర్సీపట్నానికి నిధుల వరద

స్పీకర్ అయ్యన్న చొరవతో రూ.5 కోట్లు మంజూరు చేసిన వీఎంఆర్‌డీఏ

- పలు వార్డుల్లో రోడ్లు, కాలువల నిర్మాణం



అందుబాటులోకి రానున్న కల్యాణ మండపం

నర్సీపట్నం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు చొరవతో మునిసిపాలిటీలో వివిధ అభివృద్ధి పనులకు వీఎంఆర్‌డీఏ రూ.5 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులలో సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువలు, కల్వర్టుల నిర్మాణంతోపాటు స్కేటింగ్ రింక్ ప్రహరీ గోడ మరమ్మతులు, షెడ్డు నిర్మాణం, బలిఘట్టం సత్యనారాయణస్వామి ఆలయం వద్ద అసంపూర్తిగా వున్న కల్యాణ మండపం పనులను పూర్తిచేస్తారు.

మునిసిపాలిటీలోని పలు వార్డుల్లో మట్టి రోడ్లు, కచ్చా డ్రైనేజీల కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. పట్టణంలో బీసీ కాలనీ, ఎస్సీ కాలనీ, అయ్యన్న కాలనీ, బ్యాంక్ కాలనీ, కొత్తవీధి, శివపురం ప్రాంతాలతో పాటు పెదబొడ్డేపల్లి, బలిఘట్టంలో రోడ్లు, కాలువలు అభివృద్ధి చేయాల్సి ఉంది. స్పీకర్ అయ్యన్నపాత్రుడు సూచన మేరకు వీఎంఆర్‌డీఏ అధికారులు రూ.5 కోట్లు మంజూరు చేశారు. ప్రాధాన్యతా క్రమంలో పనులు ప్రతిపాదించి నిధులు కేటాయించారు. 2వ వార్డులో ఆరు పనులకు రూ.53.3 లక్షలు, 3వ వార్డులో 8 పనులకు 48.9 లక్షలు, 7వ వార్డులో 3 పనులకు రూ.12.5 లక్షలు, 9వ వార్డులో 5 పనులకు రూ.34 లక్షలు, 10వ వార్డులో 3 పనులకు రూ.30 లక్షలు, 11వ వార్డులో 5 పనులకు రూ.53 లక్షలు, 12వ వార్డులో 2 పనులకు రూ.10 లక్షలు, 15వ వార్డులో రూ.12 లక్షలు, 16వ వార్డులో 12 పనులకు రూ.80 లక్షలు, 20వ వార్డులో ఒక పనికి రూ.75 లక్షలు, 27వ వార్డులో నాలుగు పనులకు రూ.27 లక్షలు, 28వ వార్డులో 13 పనులకు రూ.50.75 లక్షలు మంజూరు చేశారు. అధికారులు టెండర్ల ప్రక్రియ చేపట్టారు. అగ్రిమెంట్ పూర్తయిన తరువాత పనులు మొదలుపెడతారు.

గూగుల్‌ను అడ్డుకునేందుకు వైసీపీ కుట్ర : ప్రగడ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ప్రగడ నాగేశ్వరరావు

అచ్యుతాపురం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : గూగుల్‌ను అడ్డుకునేందుకు వైసీపీ నేతలు మాస్టర్ ప్లాన్ వేశారని రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు ఆరోపించారు. ఇక్కడి టీడీపీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రపంచ ప్రఖ్యాత పరిశ్రమలను తీసుకువచ్చి రాష్ట్రాభివృద్ధి జరగాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విశేషంగా కృషి చేస్తుంటే, వైసీపీ నాయకులు అడ్డుకోవడానికి కుయుక్తులు పన్నుతున్నారని మండిపడ్డారు. ఇందులో భాగంగానే ఇటీవల టీసీఎస్ స్థాపనకు 99 పైసలకే భూమిని కేటాయిస్తే వైసీపీ కోర్టును ఆశ్రయించి చీవాట్లు తిన్నదని ఎద్దేవా చేశారు. అదేవిధంగా విశాఖకు గూగుల్ రప్పించేందుకు మంత్రి నారా లోకేశ్ అహర్నిశలు కృషిచేశారని, దీనికి రెండు వందల ఎకరాలు కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించిందని చెప్పారు. భూమి ఇవ్వడానికి రైతులు అంగీకరించినా వైసీపీ నాయకులు రైతుల ముసుగులో బినామీ పేర్లతో కోర్టులో కేసులు వేశారని ఆయన ఆరోపించారు. చనిపోయిన ఒక రైతు పేరుతో కోర్టులో కేసు వేశారని, దీంతో వైసీపీ కుట్ర బయటపడిందని ఆయన వివరించారు. వైసీపీ నాయకులు ఎన్ని ఆడ్డంకులు సృష్టించినా రాష్ట్రాభివృద్ధిని అడ్డుకోలేరని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో టీడీపీ మండల అధ్యక్షుడు పీలా తులసీరామ్, క్లస్టర్ ఇన్‌చార్జి యాంద్ర అప్పలనాయుడు, లాలం రాజు తదితరులు పాల్గొన్నారు.

పంచరాత్ర ఉత్సవాలకు ముహూర్తపు రాట



రాటోత్సవంలో పాల్గొన్న బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆనంద్

ఎలమంచిలి, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ప్రసిద్ధి గాంచిన ఎలమంచిలి పంచరాత్రి ఉత్సవాలకు సన్నాహాలు ఆరంభమయ్యాయి. ఇందులో భాగంగా తులసీనగర్‌లోని భూలోకమాంబ ఆలయం వద్ద శుక్రవారం సాంప్రదాయబద్ధంగా రాటను వేశారు. బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఉత్సవ కమిటీ ఛైర్మన్ ఆడారి ఆనంద్ చేతులు మీదుగా ముహూర్తపు రాట వేశారు. ఏటా దీపావళి ప్రారంభం నుంచి నాగుల చవితి వరకూ ఇక్కడ పంచరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తుండడం ఆనవాయితీ. ఈ ఏడాది కూడా ఇందుకోసం ఘనంగా ఏర్పాట్లు చేపట్టినట్టు కమిటీ ఛైర్మన్ ఆనంద్ కుమార్, సభ్యులు తెలిపారు. నాయకులు పిల్లా రామకృష్ణ, మళ్ల కొండబాబు, గామ పెద్దలు పాల్గొన్నారు.

వైసీపీ రాష్ట్ర ఈసీ సభ్యుడిగా గోవింద్

ఎలమంచిలి, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యుడిగా ఎలమంచిలి ఎంపీపీ బోదెపు గోవిందరావు నియామకమయ్యారు. ఈ సందర్భంగా ఆయన వర్గీయులు ఆనందం వ్యక్తం చేశారు. తనపై ఎంతో నమ్మకం ఉంచి ఈ పదవిని అప్పగించినందుకు పార్టీ అధినేత జగన్‌ను శుక్రవారం కలిసి కృతజ్ఞతలు తెలిపారు.



జగన్‌ను కలిసిన గోవిందరావు



ఎలమంచిలి పరమేశ్వరీ థియేటర్ వద్ద దుర్గాదేవి విగ్రహం ఊరేగింపు



మునగపాకలో దుర్గామాత వేడుకల్లో శూలాలు ధరించిన భవానీ భక్తులు



మునగపాకలో రావణాసురుడి దహనం

ఘనంగా ముగిసిన నవరాత్రి ఉత్సవాలు

» అమ్మవారికి విశేష పూజలు » రోజుకో అవతారంలో దర్శనం » మునగపాకలో ఆకట్టుకున్న రావణ దహనం



దసరా సందర్భంగా మునగపాక షిర్డీసాయి మందిరంలో దీపారాధన

ఎలమంచిలి, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : శరన్నవరాత్రి ఉత్సవాలు గురువారం ఘనంగా ముగిశాయి. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో అమ్మవార్ల ఆలయాలు, వీధివీధిన ఏర్పాటు చేసిన మండపాల్లో విశేష పూజలు నిర్వహించారు. పలుచోట్ల దుర్గామాత రోజుకో అవతారంలో దర్శనమిచ్చారు. దసరా రోజున పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. వేకువజాము నుంచి రాత్రి వరకు పూజలు కొనసాగాయి. వాహన పూజలను అత్యంత ఘనంగా జరుపుకున్నారు. దీంతో ఎటుచూసినా సందడి వాతావరణమే కనిపించింది. ముగింపోత్సవంలో భాగంగా ఎలమంచిలిలోని పరమేశ్వరీ థియేటర్ జంక్షన్‌లో ఏర్పాటు చేసిన ఆదిమాత విగ్రహాన్ని నిర్వాహకులు మేళతాళాలు, బాజాభజంత్రీల నడుమ ఊరేగించి నిమజ్జనం చేశారు.

అచ్యుతాపురం : మండల వ్యాప్తంగా దేవీనవరాత్రి ఉత్సవాలు గురువారం రాత్రి ఘనంగా ముగిశాయి. ప్రతి రోజూ అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో మహిళలకు పసుపు, కుంకుమార్చనలు జరిపారు. పలుచోట్ల మండపాల్లో ప్రతిష్ఠించిన జగజ్జనని విగ్రహాలను ఆయా గ్రామాల్లో ఊరేగించి నిమజ్జనం చేశారు. ఇదిలావుంటే, తిమ్మరాజుపేటలో శూలాల మహోత్సవం వైభవోపేతంగా జరిగింది. పలువురు శూలలను గుచ్చుకుని ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి వెళ్లి మొక్కులు చెల్లించుకున్నారు.

రాంబిల్లి : విజయ దశమిని మండల ప్రజలు గురువారం ఘనంగా జరుపుకున్నారు. తొమ్మిది రోజుల పాటు ఆలయాలు, వీధివీధిన ఏర్పాటు చేసి మండపాల్లో దుర్గామాతకు పూజలు నిర్వహించారు. చివరి రోజున మండపాల్లో ప్రతిష్ఠించిన అమ్మవారి విగ్రహాలను పురవీధుల్లో మేళతాళాలు, బాజాభజంత్రీల నడుమ ఊరేగించి నిమజ్జనం చేశారు.

మునగపాక : నవరాత్రి ఉత్సవాలను మండల వ్యాప్తంగా అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మండల కేంద్రం మునగపాకలో మరింత ఘనంగా జరిగాయి. ఇక్కడి నందీశ్వర ప్రాంగణం, తులసీ కళావేదిక వద్ద దసరా వేడుకలు గురువారం రాత్రి మరింత వైభవోపేతంగా జరిగాయి. రిటైర్డు ఎస్పీ దివంగత పెంటకోట సత్యనారాయణ, పెంటకోట గాంధీల జ్ఞాపకార్థం వారి కుటుంబీకులు ఈ వేడుక జరిపారు. తొలుత మహిళల కోలాటం, తీన్‌మార్ వాయిద్యం తదితరాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అనంతరం రావణ దహనాన్ని చేపట్టారు. అలాగే, మునగపాక వేపచెట్టు రామాలయం వద్ద దుర్గాపీఠం ఆధ్వర్యంలో గురువారం రాత్రి భవానీ మాలధారణ చేసిన భక్తులు శూలాల మహోత్సవాన్ని నిర్వహించారు. అలాగే శ్రీషిర్డీసాయిబాబా ధ్యాన మందిరంలో దీపారాధన జరిపారు.



తిమ్మరాజుపేటలో శూలాల మహోత్సవం

గాంధీజీకి ఘన నివాళి

అచ్యుతాపురం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : జాతిపిత మహాత్మా గాంధీ జయంతిని గురువారం మండలంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇక్కడి పోలీస్ స్టేషన్ వద్ద ఆయన విగ్రహానికి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్, మాజీ ఎమ్మెల్యే కన్నబాబురాజు పూలమాల వేసి నివాళులర్పించారు. యువత గాంధీజీని స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. అలాగే, దివ్యాంగుల పాఠశాలలో రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు, మార్టూరులో గ్రామ నాయకులు గాంధీ జయంతి జరిపారు. ఈ కార్యక్రమాల్లో జనపరెడ్డి శ్రీనివాసరావు, బైలపూడి శ్రీరామదాసు, కేకే హరిబాబు, కేవీ రమణ, పుర్రే శ్రీనివాస యాదవ్, కూండ్రపు వెంకునాయుడు, ద్వారపురెడ్డి బాపూజీ పాల్గొన్నారు.

ఎలమంచిలిలో...

ఎలమంచిలి : గాంధీ జయంతి సందర్భంగా ఇక్కడి రైల్వే స్టేషన్ రోడ్డులో గల ఆయన విగ్రహానికి నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. మునిసిపల్ వైస్ ఛైర్మన్ అర్రెపు గుప్తా, చార్టెడ్ అకౌంటెంట్ బంగారుశెట్టి తదితరులు పాల్గొన్నారు.



అచ్యుతాపురం పోలీస్ స్టేషన్ వద్ద గాంధీ విగ్రహం వద్ద ఎమ్మెల్యే సుందరపు నివాళి

కోడి పందాలపై పోలీసుల దాడి

ఎలమంచిలి, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కృష్ణాపురం కాలనీ శివారులో కోడి పందాలు ఆడుతున్న నలుగుర్ని రూరల్ పోలీసులు పట్టుకున్నారు. గురువారం కోడి పందాలు జరుగుతున్నట్టు అందిన సమాచారం మేరకు దాడి చేశారు. ఈ సందర్భంగా నలుగుర్ని అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుంచి రెండు కోడి పుంజులు, రూ.720 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

గ్రామాల్లో పారిశుధ్య సమస్యపై ప్రత్యేక దృష్టి : డీపీవో సందీప్



పారిశుధ్య సిబ్బంది డీపీవో సందీప్ సూచనలు

అచ్యుతాపురం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో పారిశుధ్య సమస్య పరిష్కారానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలని డీపీవో సందీప్ పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం ఇక్కడి సంపద కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి రోజూ ఇళ్లలోని చెత్త సేకరించి, సంప కేంద్రాలకు తరలించాలన్నారు. ఎప్పటికప్పుడు కాలువలను శుభ్రం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌పీవో మూర్తి, డిప్యూటీ ఎంపీడీవో బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగునికి ఎమ్మెల్యే సొంత నిధులతో పింఛన్



సూరిబాబు నగదు అందిస్తున్న జనసేన నేతలు

రాంబిల్లి, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మురకాడలో దివ్యాంగుడైన ఈరికిల సూరిబాబుకు ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ తన సొంత నిధులతో పింఛన్ ఇచ్చి ఆదుకుంటున్నారు. షుగర్‌వ్యాధి కారణంగా సూరిబాబుకు ఒక కాలు తీసివేశారు. అప్పటి నుంచి ఇంట్లో ఉండిపోయాడు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న ఆ కుటుంబం గురించి తెలుసుకున్న ఎమ్మెల్యే పింఛన్ మంజూరయ్యే వరకు తన సొంత నిధులు అందిస్తానని ప్రకటించారని జనసేన రాంబిల్లి మండల అధ్యక్షుడు పప్పల నూకన్నదొర, సన్యాసిరావు కరెడ్ల సూర్యప్రకాశ్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం పెన్షన్ మొత్తాన్ని అందజేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఎస్.రాయవరం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొరుప్రోలు సెక్షన్ పరిధిలో ఆర్‌డీఎస్‌ఎస్ పనుల్లో భాగంగా శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఈపీడీసీఎల్ ఈఈ రాజశేఖర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉప్పరాపల్లి, వెంకటాపురం, లింగరాజుపాలెం, జేవీ పాలెం, సర్వసిద్ధి, కర్రివానిపాలెం, బసవపాడు, సైతారుపేట, వాకపాడు గ్రామాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, ఈ విషయాన్ని విని యోగదారులు గమనించి తమ సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

మత్స్యకారుల వినూత్న నిరసన

నక్కపల్లి, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): బల్క్‌డ్రగ్ పార్కు వద్దంటూ రాజయ్యపేట కేంద్రంగా జరుగుతున్న ఉద్యమంలో శుక్రవారం మత్స్యకారులు వినూత్నంగా నిరసన తెలిపారు. ఖాళీ పేట్లు పట్టుకుని బల్క్‌డ్రగ్ వస్తే తాము భిక్షాటన చేసుకోవడమేనని నినాదాలు చేశారు. వారికి వైసీపీ నేత వీసం రామకృష్ణ సంఘీభావం ప్రకటించారు. ఈ విషయం తెలిసి గురువారం మాజీ ఎమ్మెల్యే చెంగల వెంకట్రావ్ కూడా రాజయ్యపేట వెళ్లి దీక్షా శిబిరాన్ని సందర్శించి మత్స్యకారులకు మద్దతు తెలిపారు.

జీఎస్‌టీ తగ్గింపుతో రైతులకు మేలు

ఎస్.రాయవరం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): జీఎస్‌టీ తగ్గించడంతో రైతులకు ఆర్థికంగా మేలు చేకూరుతుందని మాజీ ఎంపీపీ యేజెర్ల వినోద్‌రాజు అన్నారు. కొరుప్రోలు గ్రామంలో శుక్రవారం ఏవో సౌజన్య ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ పరికరాల ధరలు తగ్గుతాయన్నారు. ఇందులో భాగంగా గ్రామంలో ట్రాక్టర్లతో అవగాహన ర్యాలీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి అల్లు నరసింహమూర్తి, సీనియర్ నేత అల్లు మోహన్ పాల్గొన్నారు.

జీఎస్‌టీపై విద్యార్థులకు అవగాహన

నక్కపల్లి, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): పెదబోదిగల్లం హైస్కూల్‌లో జీఎస్‌టీ తగ్గింపుపై శుక్రవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. హెచ్ఎం ఎస్.జయశ్రీ వస్తువుల పన్నుల ధరలను వివరించారు. తల్లిదండ్రులు పొదుపు పాటించేలా పిల్లలు చూడాలన్నారు. ఉపాధ్యాయులు ఆచార్యులు, కుమారి, పొల్లుబరావు, పద్మావతి, శ్రీదేవి, రమేశ్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

తిమ్మాపురంలో దుర్గాదేవి ఆలయ ప్రారంభోత్సం

ఎస్.రాయవరం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): మేజర్ పంచాయతీ తిమ్మాపురంలో దుర్గమ్మ ఆలయాన్ని శుక్రవారం వైభవంగా ప్రారంభించారు. వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రారంభోత్సవంలో పాల్గొన్న భక్తులందరికీ సర్పంచ్ సత్యనారాయణ ఆధ్వర్యంలో ప్రసాద వితరణ చేపట్టారు.



ఆలయంలో ప్రతిష్ఠించిన దుర్గాదేవి విగ్రహం

భావితరాలను తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులదే

రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత

మెగా డీఎస్సీలో ఎంపికైన ఉపాధ్యాయులకు ఘన సన్మానం



కొత్త ఉపాధ్యాయులను సత్కరించిన హోం మంత్రి అనిత

నక్కపల్లి, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): రాబోయే తరాలను తీర్చిదిద్దే గురుతర బాధ్యత ఉపాధ్యాయులదేనని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. నియోజకవర్గం పరిధిలో మెగా డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ పోస్టులకు ఎంపికైన 147 మందికి విజయదశమి పండుగ రోజైన గురువారం వేంపాడు హైవే టోల్ ప్లాజా సమీపాన వున్న భారతి కన్వెన్షన్ హాలులో మంత్రి అనిత సత్కరించారు. వారిని దుశ్శాలువలతో సత్కరించిన అనంతరం మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థులకు స్ఫూర్తిదాయకంగా నిలవాలన్నారు. కోర్టులో 140 కేసులు ఉన్నా, ప్రభుత్వం పట్టుదలతో అన్నీ క్లియర్ చేసుకుని సజావుగా ఈ ప్రక్రియ చేపట్టిందన్నారు. మంత్రి లోకేశ్ మెగా డీఎస్సీ మాట నిలబెట్టుకోవడం కోసం ఒక తపస్సు చేశారనిచెప్పారు. సీఎం చంద్రబాబు నాయకత్వంలో ఇప్పటి వరకూ తొమ్మిది డీఎస్సీలు తీసినట్టు చెప్పారు. తాను కూడా 2002లో టీచర్‌గా చేరానని, కొత్త ఉపాధ్యాయులు ఏ పాఠశాలలో చేరుతారో? అక్కడే తాను ఇచ్చిన మొక్కలను పెంచాలని, అదే తనకు ఇచ్చే గిఫ్ట్ అని పేర్కొన్నారు. మంత్రి లోకేశ్ విద్యావ్యవస్థలో సమూల మార్పులు, సంస్కరణలు తీసుకువచ్చారని చెప్పారు. పాఠశాలలు దేవాలయాల్లాంటివని, అక్కడ రాజకీయ వేడుకలు నిర్వహించకూడదని సూచించారు. పాయకరావుపేట మండలం పీఎల్‌పురం గ్రామానికి చెందిన నూతన టీచర్ ధనలక్ష్మికి మంత్రి నియామక ఉత్తర్వులను అందించారు. నూతన ఉపాధ్యాయులతో కలిసి భోజనం చేశారు. కొత్తగా ఎంపికైన ఉపాధ్యాయులు లోకేశ్ ఫొటోకు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు చెందిన కూటమి నాయకులు పాల్గొన్నారు.

వెంకన్న క్షేత్రంలో ముగిసిన బ్రహ్మోత్సవాలు

వైభవంగా మృగవేట, పూర్ణాహుతి





ఉపమాక ఆలయంలో జమ్మి పూజ చేస్తున్న అర్చకులు... పుష్కరిణిలో సుదర్శన పెరుమాళ్‌కు చక్రస్నానం చేసిన అర్చకులు

నక్కపల్లి, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉపమాక క్షేత్రంలో ఈ ఏడాది శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా ముగిశాయి. ఎన్నో విశిష్ట సేవలు, పూజా కార్యక్రమాలు భక్తులను తన్మయత్వానికి గురిచేశాయి. గురువారం మహాపూర్ణాహుతి, చూర్ణోత్సవం, అద్దపు సేవ, వినోద ఉత్సవం, చక్రవారీ స్నానం, ఆలయంలో శమీపూజ వంటి కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. లక్ష్మీ సహస్రనామార్చన, ధ్వజావరోహణం వంటి కార్యక్రమంలో ఘనంగా జరిగాయి. ముగింపు ఉత్సవాల్లో భాగంగా స్వామివారి మృగ వేట భక్తులను ఎంతగానో అలరించింది.

మృగవేటకు వెళ్లినప్పుడు స్వామివారు బంగారు ఉంగరం పారేసుకుంటే, అమ్మవారు మా తల్లిదండ్రులు ఇచ్చిన ఉంగరమేది? ఎవరికిచ్చారని ప్రశ్నిస్తే? ఆ సర్వాంతర్యామి పల్లకీలో ముఖం ఎవరికీ కనబడకుండా ఉంగరాన్ని వెతికే ఘట్టాన్ని అర్చకులు కళ్లకు కట్టినట్టు చూపారు. ఈ సమయంలో ఉత్సవాలు తిలకించేందుకు వచ్చిన భక్తులను అనుమానిస్తూ స్వామివారి ఉంగరం మీరే తీశారు? మర్యాదగా ఇచ్చేయండని ప్రధానార్చకులు ప్రసాదాచార్యులు పలువురిని నిలదీస్తే వారంతా ఆందోళన చెందారు. ఆ తరువాత వినోద ఉత్సవంలో భాగంగా ఇలా జరిగిందని తెలుసుకుని ఎంతో సంభ్రాశ్చర్యాలకు గురయ్యారు. చివరకు స్వామివారి పాదాల చెంతనే ఉంగరం వుందని చూపి ఉత్సవాన్ని ముగించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఘనంగా ముగిసిన దసరా నవరాత్రి ఉత్సవాలు

పాయకరావుపేట/పాయకరావుపేట రూరల్/ఎస్.రాయవరం అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): పాయకరావుపేటలో కనకదుర్గ అమ్మవారి దసరా నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. స్థానిక బృందావనంలోని దుర్గాలమ్మచెట్టు అమ్మవారి ఆలయంలో కనకదుర్గ అమ్మవారిని వివిధ పుష్పాలతో అలకరించారు. సందర్భంగా పట్టణంలో దుర్గానగర్‌లో నియోజకవర్గ తెలుగు మహిళ అధ్యక్షురాలు మల్లపురెడ్డి రమాకుమారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శరన్నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా మహిళలు భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. యంగ్ డైనమిక్ బాయ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కోలాటం, అన్న సమారాధన నిర్వహించారు. ఎస్.రాయవరం మండలంలోని అన్ని గ్రామాల్లో శరన్నవరాత్రుల ఉత్సవాలు ముగిశాయి. అమ్మవారి ప్రతిమలను పలు సాంస్కృతిక కార్యక్రమాల నడుమ ఘనంగా ఊరేగించి నిమజ్జనం చేశారు. ధర్మవరం అగ్రహారం గ్రామంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. టీడీపీ సీనియర్ నాయకులు సుంకర శ్రీనివాసరావు, శియ్యాదుల అచ్యుత్‌కుమార్, బండి నాగేశ్వరరావు పాల్గొన్నారు.



పాల్తేరులో తెప్పోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

బస్సును ఢీకొన్న అంబులెన్స్: ముగ్గురికి గాయాలు

నక్కపల్లి, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక సీహెచ్‌సీ జంక్షన్ వద్ద ప్రైవేటు అంబులెన్స్ ప్రమాదానికి గురైంది. ఎలమంచిలి నుంచి మృతదేహంతో మహారాష్ట్రకు వెళుతున్న ప్రైవేటు అంబులెన్స్, ఆస్పత్రి జంక్షన్ వద్దకు రాగానే మలుపుతిరుగుతున్న హెటిరో కంపెనీ బస్సును ఢీకొట్టింది. దీంతో అంబులెన్స్ ముందుభాగం దెబ్బతిన్నది. ఇందులో వున్న చిన శంకర్‌దాదోసీ, ఎస్.శివ శంకర్ ,అర్జున్ గాయపడ్డారు. వీరికి స్థానిక సీహెచ్‌సీలో ప్రాథమిక చికిత్స చేసి అనకాపల్లి తరలించారు. కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ సన్నిబాబు చెప్పారు.



బస్సును ఢీకొన్న అంబులెన్స్

కారు దూసుకుపోయి ముగ్గురికి...

నక్కపల్లి, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొడిచెర్ల-ఉద్దండపురం హైవే జంక్షన్ వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు గాయపడ్డారు. ఒంగోలు నుంచి విశాఖపట్నం వస్తున్న కారు గొడిచెర్ల హైవే జంక్షన్ వద్ద ముందు వెళ్తున్న వాహనాన్ని ఢీకొట్టి రోడ్డు పక్కకు దూసుకుపోయింది. కారు బాగా దెబ్బతింది. కారులో వున్న మరిడి గంగాధర్ ,అతని భార్య, కుమారుడు స్వల్పంగా గాయపడ్డారని, కేసు నమోదు చేశామని పోలీసులు చెప్పారు.



ప్రభుత్వ కార్యాలయాల్లో చోరీకి విఫలయత్నం

నక్కపల్లి, అక్టోబరు 3: స్థానిక తహశీల్దార్, ఎంపీడీవో కార్యాలయాల్లో బుధవారం అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు ప్రవేశించి చోరీకి విఫలయత్నం చేశారు. ఎంపీడీవో కార్యాలయం కిటికీ గుండా లోపలకి ప్రవేశించి అగంతకులు, బీరువా తలుపులు పగులగొట్టి, రికార్డులను చిందరవందర చేశారు. సమీపంలో వున్న తహశీల్దార్ కార్యాలయంలో కిటికీలు పగులగొట్టి లోపలికి ప్రవేశించి బీరువాలను తెరిచారు. ఫైళ్లను చిందరవందరగా పడేసి, సీసీ కెమెరా ఫుటేజీలను భద్రపరిచే డీవీఆర్ (డిస్క్)ను పట్టుకుపోయారు. ఈ సంఘటనపై అందిన ఫిర్యాదుల మేరకు కేసులు నమోదు చేశామని, క్లూస్ టీమ్ వచ్చి ఆధారాలు సేకరించిందని ఎస్ఐ సన్నిబాబు చెప్పారు.

క్రీడాకారుడు గణేశ్‌కు గెడ్డం బుజ్జి ఆర్థిక సాయం



వాలీబాల్ వరల్డ్ కప్‌నకు ఎంపికైన గణేశ్‌కు సాయం అందిస్తున్న బుజ్జి

పాయకరావుపేట రూరల్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): అమెరికాలో ఈ నెల 12 నుంచి జరుగనున్న పారా వాలీబాల్ వరల్డ్ కప్ పోటీలకు ఎంపికైన ఎస్.రాయవరం మండలం సోముదేవుపల్లి గ్రామానికి చెందిన అన్నం గణేశ్‌ను జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి గెడ్డం బుజ్జి అభినందించారు.మండలంలోని గుంటపల్లిలో గెడ్డం బుజ్జిని శుక్రవారం కలిసిన గణేశ్‌ను ఘనంగా సత్కరించి ఆర్థిక సాయం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరల్డ్ కప్ పోటీల్లో రాణించి దేశానికి మంచిపేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నాయకులు గెడ్డం ఆకాశ్, లింగంపల్లి జ్యోతికుమార్, టి.అరవింద్, వినోద్ రాయల్స్, ఎం.రాజు, వీసం సాయి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యం సేకరణ

▸▸ అధికారులకు కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్. పక్కన జేసీ ఎం.జాహ్నవి

అనకాపల్లి కలెక్టరేట్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం సేకరణ విషయంలో రైతులు ఎటువంటి ఇబ్బంది పడకుండా చూడాలని కలెక్టర్ విజయకృష్ణన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జేసీ ఎం.జాహ్నవితో కలిసి జిల్లాస్థాయి ధాన్యం సేకరణ సమన్వయ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డివిజన్, మండలస్థాయి అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర ప్రకారం కామన్ రకం అయితే క్వింటా రూ.2,369, ఏ గ్రేడ్ రకం అయితే రూ.2,389 కొనుగోలు చేయాలని చెప్పారు. ధాన్యం కొనుగోలుకన్నా ముందే ఈ-పంట, ఈ-కేవైసీ నమోదు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. మండల స్థాయిలో ధాన్యం కొనుగోలు కమిటీ ఏర్పాటు చేసి నిరంతర పర్యవేక్షణ చేయాలన్నారు. సమావేశంలో జిల్లా పౌరసరఫరాల మేనేజర్ పి.జయంతి పాల్గొన్నారు.

నామినేటెడ్ పదవుల్లో యాదవులకు గుర్తింపు

▸▸ యాదవ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు 'భరణికాన'



నామినేటెడ్ పదవులు పొందిన వారిని సత్కరించిన సంఘం ప్రతినిధులు

కొత్తూరు, అక్టోబర్ 3 (ఆంధ్రజ్యోతి) : నామినేటెడ్ పదవులు పొందిన యాదవ సామాజికవర్గ నాయకులను శుక్రవారం ఇక్కడ ఘనంగా సత్కరించారు. అనకాపల్లి జిల్లా యాదవ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు భరణికాన సాయినాథరావు ముఖ్య అతిథిగా మాట్లాడారు. కూటమి ప్రభుత్వం యాదవులకు పెద్దపీట వేస్తున్నట్టు చెప్పారు. ఇందులో భాగంగానే వివిధ పదవులకు ఎంపిక చేసిందని ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం పదవులు పొంది పద్దెనిమిది మందిని ఘనంగా సత్కరించి, అభినందించారు. యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ ధూళి రంగనాయకులు, పాయకరావుపేట మార్కెట్ కమిటీ చైర్మన్ దేవర సత్యనారాయణ, మార్కెట్ కమిటీలు, పీఏసీఎస్‌ల డైరెక్టర్లు తదితరులతో పాటు యాదవ సామాజికవర్గ సభ్యుల పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి పీహెచ్‌సీ వైద్యుల ధర్నా



ఎన్టీఆర్ వైద్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న పీహెచ్‌సీల వైద్యులు

అనకాపల్లి టౌన్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు శుక్రవారం ఎన్టీఆర్ వైద్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ ప్రైమరీ హెల్త్ సెంటర్ డాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ఆందోళనలో ఇన్ సర్వీస్ పీజీ కోటాను పునరుద్ధరించాలని, టైమ్ బాండ్ ప్రమోషన్లు అమలు చేయాలని, గిరిజన ప్రాంతాల్లో పనిచేసే వారికి బేసిక్‌పై యాభై శాతం ట్రైబల్ అలవెన్స్ మంజూరు చేయాలన్న తదితర డిమాండ్లపై నినాదాలు చేశారు. ఈ ధర్నాలో అసోసియేషన్ ప్రతినిధులు, పీహెచ్‌సీ వైద్యులు పాల్గొన్నారు.

కొత్తూరు పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై గ్రామ సభ



గ్రామ సభలో మాట్లాడుతున్న పంచాయతీ కార్యదర్శి సుభాష్

కొత్తూరు, అక్టోబర్ 3 (ఆంధ్రజ్యోతి) : మేజర్ పంచాయతీ కొత్తూరులో అభివృద్ధి ప్రణాళికపై శుక్రవారం సర్పంచ్ సప్పారపు లక్ష్మీప్రసన్న అధ్యక్షతన గ్రామ సభ ఏర్పాటైంది. జడ్పీ వైస్ చైర్‌పర్సన్ భీశెట్టి సత్యవతి, జడ్పీ కో-ఆప్షన్ సభ్యుడు పెతకంశెట్టి శివ సత్యనారాయణ తదితర నాయకులు ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. శారదానగర్, ముత్రాసి కాలనీ, దేవీనగర్, సాయినగర్, ఎన్టీవోస్ కాలనీవాసులు పలు సమస్యలను వివరించారు. ప్రధానంగా పంచాయతీలో కోతుల బెడద ఎక్కువగా ఉందని, కుక్కలు, పందులు వల్ల చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పేర్కొన్నారు. ఇంటింటి కుళాయిల ఏర్పాటుకు తవ్విన గోతులను పూడ్చకపోవడం వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు చెప్పారు. ఇలా మరిన్ని సమస్యలను వివరించి పరిష్కరించాలని కోరారు. వీటన్నింటినీ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్లనున్నట్టు పంచాయతీ కార్యదర్శి సుభాష్ తెలిపారు ఉప సర్పంచ్ అనపర్తి శ్రీను, కూటమి నాయకులు మేడిశెట్టి సత్తిబాబు, మేడిశెట్టి నూకరాజు, బర్ల నాగరాజు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

వివిధ పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం



విజేతకు టీవీ అందజేస్తున్న పైలా శ్రీనివాసరావు

పరవాడ, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పరవాడలో బొంకుల దిబ్బయాత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆటల పోటీల విజేతలతో పాటు లక్కీ డ్రా విజేతలకు వైసీపీ రాష్ట్ర కార్యదర్శి పైలా శ్రీనివాసరావు గురువారం రాత్రి బహుతులు పంపిణీ చేశారు. సర్పంచ్ శిరపురపు అప్పలనాయుడు, నాయకులు రెడ్డి శ్రీనివాసరావు, రామచంద్రరావు, పైలా అప్పలనాయుడు, హరీష్, వెంకటరావు, బొంకులదిబ్బయాత్ ప్రతినిధులు చీపురుపల్లి శ్రీనివాసరావు, పైడం నాయుడు, వాసు తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పునరుద్ధరించాలి

పరవాడ, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని సీఐటీయూ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. తానాం గ్రామంలో శుక్రవారం ఏర్పాటు చేసిన భవన నిర్మాణ కార్మికుల సమావేశంలో మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వం కార్మిక సంక్షేమ పథకాలను నిలిపివేస్తూ 1214 మెమోను జారీ చేసిందన్నారు. ఇసుక కొరత, కరోనా కాలంలో కార్మికులను ఏ రకంగా మోసం చేసిందో అందరికీ తెలిసిన విషయమేనన్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత సంక్షేమ పథకాలను అందిస్తామని హామీ ఇచ్చినా కార్యరూపం దాల్చలేదన్నారు. ఈ సమావేశంలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పి.చిరంజీవి, జి.సన్యాసిరావు, రొంగలి కన్నంనాయుడు, పీఆర్ నాయుడు, అప్పారావు, శ్రీను, సత్తిబాబు పాల్గొన్నారు.



కాళికాదేవి విగ్రహాన్ని ఊరేగిస్తున్న భక్తులు



ఊరేగింపులో సాంస్కృతిక కార్యక్రమాలు



ఆకట్టుకున్న అమ్మవార్ల వేషధారణలు

అంబరాన్నంటిన దసరా సంబరం

▸▸ ఆనందోత్సాహాల నడుమ దుర్గామాత వేడుకలు ▸▸ అత్యంత భక్తిశ్రద్ధలతో నవరాత్రి ఉత్సవాలు

▸▸ అనకాపల్లిలో మరింత కోలాహలం ▸▸ చివరి రోజు గవరపాలెం సతకంపట్టు వద్ద ఊరేగింపు



అనకాపల్లిలో నవదుర్గల విగ్రహాల ఊరేగింపు



అమ్మవారి ఊరేగింపును ప్రారంభిస్తున్నఎమ్మెల్యే కొణతాల

అనకాపల్లి టౌన్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : దసరా పండుగను గురువారం ప్రజలంతా అత్యంత ఘనంగా జరుపుకున్నారు. వేకువనే లేచి తలంటు పోసుకుని, నూతన వస్త్రాలు ధరించి ఇంటిల్లిపాదీ ఆదిమాత దుర్గాదేవికి పూజలు నిర్వహించారు. ఆలయాల్లో, వివిధ మండపాల్లో కొలువుదీరిన జగజ్జనని దర్శించుకున్నారు. తమ తమ వాహనాలకు పూజలు జరిపారు. అనకాపల్లి పట్టణంలో ఈ వేడుకలు మరింత వైభవోపేతంగా జరిగాయి. గవరపాలెం సతకంపట్టు వద్ద ఉన్న కనక దుర్గమ్మ సంబరం గురువారం రాత్రి అంబరాన్నంటింది. ఉదయం నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చి దర్శించుకున్నారు. శరన్నవరాత్రి ఉత్సవాల ప్రారంభం రోజున ఉత్సవమూర్తిని రథంపై ఉంచి పుర వీధుల్లో ఊరేగించారు. బుధవారం రాత్రికి పూడిమడక రోడ్డులోని రామాలయానికి చేరుకుంది. అక్కడ గురువారం రాత్రి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ నవదుర్గల తిరుగు రథయాత్రను ప్రారంభించారు. ముందుగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. నవదుర్గ విగ్రహాల దాత దాడి జయవీర్, ఆలయ కమిటీ సభ్యులు ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు భారీ ఏర్పాట్లు చేపట్టారు. విద్యుద్దీపాలంకరణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సాయంత్రం నుంచి సాగిన అమ్మవారి నవదుర్గల ఊరేగింపులో 'అనకాపల్లి సినిమా' హీరో విక్రమ్, నిర్మాతలు నక్కిన త్రినాథరావు, కాండ్రేగుల నాయుడు పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారికి ఎదురెళ్లి దర్శించుకున్నారు. అలాగే గవరపాలెంలోని పలు ప్రాంతాల్లో ఉత్సవ కమిటీ ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు తిలకించేందుకు జిల్లా నలుమూలల నుంచి పెద్ద ఎత్తున తరలి వచ్చారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఇటు నిర్వాహకులు, అటు పోలీసులు చర్యలు చేపట్టారు. ఆలయ శాశ్వత చైర్మన్ కాండ్రేగుల నాయుడు, వ్యవస్థాపకులు పీవీ రమణ, ఉత్సవ కమిటీ చైర్మన్ భీమరశెట్టి వరహా నూకరాజు, గౌరీ పరమేశ్వరి కమిటీ సభ్యులు, మరిడిమాంబ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. గౌరీ పంచాయతన ఆలయంలో అమ్మవారి మూలవిరాట్‌కు పంచామృతాలతో అభిషేకించారు. కమిటీ ఏర్పాటు చేసిన భారీ అన్నసమారాధనను వర్తక సంఘం కార్యదర్శి కొణతాల లక్ష్మీనారాయణ ప్రారంభించారు. కన్యకాపరమేశ్వరి, కామాక్షిదేవి, సర్వకామదాంబ, సంతోషిమాత ఆలయాలతో పాటు లక్ష్మీదేవిపేట, విజయరామరాజుపేట, వేల్పుల వీధి రజక కాలనీలోని దుర్గమ్మ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కశింకోట : మండల వ్యాప్తంగా దసరా వేడుకను ఘనంగా జరుపుకున్నాయి. కశింకోట కనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారిని టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ దర్శించుకున్నారు. ఆలయ ధర్మకర్త ప్రసాద్, టీడీపీ నాయకులు వేగి దొరబాబు, వేగి పాపారావు, కొయిలాడ నాగు, వేగి వెంకట్రావు పాల్గొన్నారు.

లంకెలపాలెం : జీవీఎంసీ 79, 85 వార్డుల పరిధి లంకెలపాలెం పరిసర ప్రాంత గ్రామాల్లో దసరా వేడుకలను అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక మరిడిమాంబ ఆలయంలో అమ్మవారికి నిర్వాహకులు అభిషేకాలు జరిపి, పసుపు కొమ్ములతో అలంకరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. అలాగే పెదముషిడివాడ, గండివానిపాలెం, సాలాపువానిపాలెం, శ్రీరామ్‌నగర్, మంత్రిపాలెం, కన్నూరు, లంకెలపాలెం తదితర గ్రామాల్లోని అమ్మవార్ల ఆలయాల్లో, వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన మండపాల్లో దుర్గామాతకు విశేష పూజలు నిర్వహించారు.

మహాత్ముని మార్గం అనుసరణీయం

▸▸ కలెక్టర్ విజయకృష్ణన్ ▸▸ గాంధీజీ, లాల్‌బహుదూర్‌శాస్త్రిలకు నివాళి



మహాత్మా గాంధీ, లాల్‌బహుదూర్‌శాస్త్రి చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్, అధికారులు



పరవాడలో గాంధీ చిత్రపటం వద్ద ఎన్టీపీసీ ఈడీ సమీర్‌శర్మ, తదితరుల నివాళి



అనకాపల్లి మార్కెట్ యార్డులో మహాత్ముని విగ్రహం వద్ద...

అనకాపల్లి కలెక్టరేట్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): అహింసే ఆయుధంగా దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన మహనీయుడు మహాత్మాగాంధీ అని, ఆయన మార్గం అనుసరణీయమని కలెక్టర్ విజయకృష్ణన్ అన్నారు. జాతిపిత మహాత్మాగాంధీజీ 156వ జయంతి, భారతదేశ రెండో ప్రధానమంత్రి లాల్ బహదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా గురువారం కలెక్టరేట్‌లో వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, సుపరిపాలన ద్వారా గ్రామ స్వరాజ్య స్థాపన జరగాలని గాంధీజీ కలలు కన్నారని, వాటిని సాకారం చేయాల్సిన బాధ్యత మనందరిపైనా వుందని అన్నారు. సత్యమే దైవమని, సత్యాన్నే ఆయుధంగా ఎంచుకోవాలని గాంధీజీ బోధించారన్నారు. అహింస ద్వారా ఏదైనా సాధించవచ్చని నిరూపించని మహనీయుడు అని కొనియాడారు. శాంతి సందేశాన్ని అందించవచ్చని నిరూపించారు. లాల్‌బహుదూర్‌శాస్త్రి జై జవాన్.. జై కిసాన్ నినాదంతో రైతులకు ఎన్నో సేవలు అందించారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌వో వై.సత్యనారాయణరావు, కలెక్టరేట్ ఏవో విజయ్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అనకాపల్లి టౌన్ : పట్టణంలోని పలు ప్రాంతాల్లో గురువారం జాతిపిత గాంధీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఎన్టీఆర్ మార్కెట్ యార్డులో మాజీ ఎమ్మెల్సీ, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బుద్ద నాగజగదీశ్వరరావు ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రింగు రోడ్డులోని జనసేన కార్యాలయంలో మహాత్ముని చిత్రపటానికి కూటమి నాయకులు పూలమాల వేసి అంజలి ఘటించారు. జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ మహాత్మాగాంధీ, లాల్ బహదూర్‌శాస్త్రి జయంతి నిర్వహించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, నాయకులు పలకా రవి, డాక్టర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పరవాడ : మహాత్మాగాంధీ జయంతిని సింహాద్రి ఎన్టీపీసీకి చెందిన దీపాంజలినగర్‌లో గురువారం నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి సింహాద్రి సంస్థ ఈడీ సమీర్‌శర్మ పూలమాల వేసి నివాళులర్పించారు. గాంధీజీ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. వివిధ విభాగాల జీఎంలు, ఏజీఎంలు, దీపికా లేడీస్ క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

లంకెలపాలెం : పెదముషిడివాడలో స్థానిక పెద్దలు గాంధీజీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బంధం వెంకటరమణ, కలవలపల్లి సత్యనారాయణ, కిరణ్, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

లారీని ఢీకొన్న ఆటో.. ఏడుగురికి గాయాలు

అనకాపల్లి టౌన్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై పూడిమడకరోడ్డు జంక్షన్ వంతెనపై గురువారం అర్ధరాత్రి జరిగిన ప్రమాదంలో ఏడుగురు గాయపడ్డారు. ట్రాఫిక్ సీఐ ఎం.వెంకటనారాయణ తెలిపిన సమాచారం మేరకు.. పార్వతీపురం మన్యం జిల్లాకు చెందిన భవాని మాలధారులు విజయవాడవెళ్లి ఆటోలో తిరిగి వస్తున్నారు. ఇదే సమయంలో విజయవాడ నుంచి విశాఖపట్నం వైపు వెళ్తన్న లారీ ఆకస్మికంగా ఆగడంతో, వెనుక వస్తున్న ఆటో ఢీకొన్నది. ఈ సంఘటనలో పార్వతీపురం మన్యం జిల్లాకు చెందిన ఓ. గురయ్య, మరో ఆరుగురికి గాయాలయ్యాయి. వీరికి ఎన్టీఆర్ వైద్యాలయంలో ప్రథమ చికిత్స చేసి, అనంతరం విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలించారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

వెంకుపాలెంలో ఏడు తులాల బంగారు ఆభరణాలు చోరీ



చోరీ జరిగిన ఇంట్లో వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్ టీం

కొత్తూరు, అక్టోబర్ 3 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి మండలంలోని ఓ ఇంట్లో చోరీ ఘటనపై కేసు నమోదు చేసినట్టు రూరల్ సీఐ అశోక్‌కుమార్ తెలిపారు. ఇందుకు సంబంధించి ఆయన కథనం ప్రకారం వివరాలివి. వెంకుపాలెం గ్రామానికి చెందిన లెక్కల నాగ వెంకట సత్యనారాయణమూర్తి తన కుటుంబ సభ్యులతో కలిసి దసరా పండుగ సందర్భంగా బుధవారం విశాఖపట్నంలో ఉంటున్న అత్తవారింటికి వెళ్లారు. తిరిగి శుక్రవారం ఉదయం స్వగ్రామానికి వచ్చి చూడగా, ఇంటి తలుపులకు వేసి ఉన్న తాళం పగుల గొట్టి కనిపించింది. కంగారుగా ఇంట్లోకి వెళ్లి చూడగా ఏడు తులాల బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్టు గుర్తించారు. వెంటనే ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. క్లూస్ టీం అక్కడికి చేరుకుని వివరాలు సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ చెప్పారు.

డైట్ కళాశాలలో ఇంక్యుబేషన్ సెంటర్ ప్రారంభం



ఇంక్యుబేషన్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న ప్రసాద్‌రెడ్డి

అనకాపల్లి టౌన్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి డైట్ ఇంజనీరింగ్ కళాశాలలో బీఎస్ఎన్ఎల్ సహకారంతో ఏర్పాటైన రీసెర్చ్, ఇన్నోవేషన్ అండ్ ఇంక్యుబేషన్ సెంటర్‌ను శుక్రవారం సదరు సంస్థ అధికారులు జి.ప్రసాద్‌రెడ్డి, డాక్టర్ ఎం.సత్యప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రీసెర్చ్ అండ్ ఇన్నోవేషన్ ఇంక్యుబేషన్ ల్యాబ్ విద్యార్థులకు, అధ్యాపకులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.వైకుంఠరావు, కన్వీనర్ డాక్టర్ జీవీ శ్రీధర్, డాక్టర్ పి.పూర్ణప్రియ, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుపై విస్తృత అవగాహన

▸▸ వ్యవసాయ పరికరాల కొనుగోలులో రైతులకు ప్రయోజనం : కలెక్టర్ విజయకృష్ణన్

▸▸ అనకాపల్లిలో ట్రాక్టర్లతో ర్యాలీ



ట్రాక్టర్ నడుపుతున్న కలెక్టర్ విజయకృష్ణన్. వాహనంపై ఎమ్మెల్యే కొణతాల, పీలా గోవింద, ద్వారపురెడ్డి, సురేంద్ర



పరవాడలో మాట్లాడుతున్న జీఎస్టీ డివిజన్ జాయింట్ కమిషనర్ శేషాద్రి

అనకాపల్లి టౌన్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): 'సూపర్ జీఎస్టీ.. సూపర్ సేవింగ్'పై గ్రామస్థాయిలో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని కలెక్టర్ విజయకృష్ణన్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఎన్టీఆర్ మార్కెట్ యార్డులో జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, వ్యవసాయ, అనుబంధ రంగాలకు చెందిన యంత్రాలు, పరికరాలపై జీఎస్టీని 12 శాతం నుంచి ఐదు శాతానికి తగ్గించడం రైతులకు ఆర్థిక ప్రయోజనం చేకూరి, ఆయా పరికరాలు తక్కువ ధరకు లభిస్తాయన్నారు. వ్యవసాయ పనులకు వినియోగించే ట్రాక్టర్లు, టైర్లు, పంపులపై పన్నులు గతంలో 12 నుంచి 18 శాతం వరకు వుండేవని, జీఎస్టీ 2.0తో ఐదు శాతానికి తగ్గాయని చెప్పారు. ఉదాహరణకు రూ.6 లక్షల ఖరీదు చేసే ట్రాక్టర్‌పై పన్ను తగ్గింపు ద్వారా రూ.42 వేలు ఆదా అవుతాయన్నారు. బయో పురుగుల మందులపై పన్ను ఐదు శాతానికి తగ్గిందన్నారు. ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం రైతు పక్షపాతి అని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతు సంక్షేమానికి కృషి చేస్తున్నాయని పేర్కొన్నారు. అనంతరం యంత్ర పరికరాల స్టాల్స్ ప్రదర్శన ప్రారంభించి, జిల్లా వ్యవసాయ శాఖ, అనుబంధ రంగాల ఆధ్వర్యంలో ఎన్టీఆర్ మార్కెట్ యార్డు నుంచి నెహ్రూచౌక్ వరకు జీఎస్టీ తగ్గింపుపై ట్రాక్టర్లతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కలెక్టర్, ఎమ్మెల్యే కొణతాలతో కొంత దూరం ట్రాక్టర్ నడిపారు. ఈ కార్యక్రమంలో అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, ఆర్డీవో షేక్ ఆయిషా, జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి షేక్ రహీం, మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, జీవీఎంసీ జోనల్ కమిషనర్ కె.చక్రవర్తి, నాయకులు పాల్గొన్నారు.

పరవాడ : విశాఖ ఫార్మాసిటీ కమర్షియల్ హబ్‌లో శుక్రవారం జీఎస్టీ 2.0పై అవగాహన సదస్సు నిర్వహించారు. జీఎస్టీ విశాఖ డివిజన్ జాయింట్ కమిషనర్ టి.శేషాద్రి ముఖ్య అతిథిగా మాట్లాడారు. ఏఏ వస్తువులపై ఎంత వరకు జీఎస్టీ తగ్గిందో వివరించారు. దీనివల్ల పరిశ్రమల యాజమాన్యాలకు ఎంతగానో లాభం చేకూరిందన్నారు. ఈ సదస్సులో జిల్లా పరిశ్రమల విభాగం జనరల్ మేనేజర్ పి.ప్రసాద్, అసిస్టెంట్ కమిషనర్లు ప్రేమ్‌కుమార్, సింధుప్రియ, విశాఖ ఫార్మాసిటీ డీజీఎం గిరిధరరావుభక్షి పాల్గొన్నారు.

సబ్బవరం : జీఎస్టీలో సంస్కరణలు రైతులకు ఎంతో మేలని మండల వ్యవసాయాధికారి పోతల సత్యనారాయణ అన్నారు. సబ్బవరంలో శుక్రవారం ఎంపీడీవో కార్యాలయం నుంచి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాగుకు వినియోగించే ట్రాక్టర్లు, డ్రిప్పులు, స్ప్రింక్లర్లు తదితర పరికరాల ధరులు తగ్గాయన్నారు. పాడి రైతులకూ ఊతం ఇస్తాయన్నారు. సర్పంచ్ దెడ్డం ప్రసాదరావు, పీఏసీఎస్ డైరెక్టర్ పల్ల తాతా రావు, కొరాడ శ్రీను, ఆకుల గణేశ్, పోతల అప్పలనాయుడు, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

కశింకోట : సూపర్ జీఎస్టీపై ఇక్కడి జాతీయ రహదారిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జీఎస్టీలో సంస్కరణల వల్ల వ్యవసాయరంగానికి ఎంత మేరకు మేలు చేకూరిందో వివరించారు. సాధారణ, మధ్య తరగతి ప్రజల జీవితాలను మెరుగుపరచడంపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించిందని వ్యవసాయాధికారులు తెలియజేశారు. రైతులకు అవసరమైన ట్రాక్టర్ల కొనుగోలుపై ఐదు శాతం తగ్గిందని, వాటి విడి భాగాలపై పద్దెనిమిది శాతం నుంచి ఐదు శాతానికి తగ్గించినట్టు వివరించారు. సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

గ్రామసభల ద్వారా ఉపాధి హామీ పనులు గుర్తింపు

» జిల్లా అధికారి విద్యాసాగర్



చిలకలగెడ్డ గ్రామసభలో మాట్లాడుతున్న విద్యాసాగర్

అనంతగిరి, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): ముందస్తు ప్రణాళికలతోనే గ్రామసభల ద్వారా చేపట్టాల్సి ఉపాధిహామీ పనులు చేపట్టడం సాధ్యమవుతుందని జాతీయ ఉపాధిహామీ పథకం ప్రాజెక్టు జిల్లా అధికారి విద్యాసాగర్ అన్నారు. మండలంలోని చిలకలగెడ్డ సచివాలయంలోని శుక్రవారం సర్పంచ్ మజ్జి అప్పారావు అధ్యక్షత గ్రామసభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ.. గ్రామసభ ద్వారా 2026-27 సంబంధించి చేపట్టాల్సిన పనులను గుర్తిస్తున్నామన్నారు. అందులో చెరువుల పూడికతీత, చెరువుల నిర్మాణం, కందకాల తవ్వకాలు, ఇంకుడు గుంతలు, నీటి గుంతలు 196 రకాల వివిధ పనులను గుర్తిస్తున్నట్టు వివరించారు. వ్యవసాయ ఆధారిత, మౌలికవసతులు, జీవనోపాధి పనులను చేపట్టేందుకు కృషిచేస్తున్నామన్నారు. ప్రతి కుటుంబానికి ఉపాధి పనిదినాలను కల్పించేలా ఏపీవో, క్షేత్రస్థాయి సిబ్బందికృషిచేయాలని సూచించారు. అదికర్మ యోగి గ్రాభలోని సీసీరోడ్లు, డ్రైనే జీ తదితర పనులను తీర్మానం చేశారు. ఈ కార్యక్రమంలోని ఎంపీడీవో ప్రభాకర్, ఏపీవోలు సన్యాసినాయుడు, అర్జున్, కార్యదర్శి లావణ్య, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గాంధీ జయంతి వేడుకలు



మహాత్ముని చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సర్పంచ్ ఉషారాణి తదితరులు

పాడేరురూరల్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): జాతిపిత మహాత్మాగాంధీ జయంతి వేడుకలను గురువారం పాడేరు పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ కొట్టగుళ్లి ఉషారాణి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి కొట్టగుళ్లి సుబ్బారావు, పంచాయతీ పాలక వర్గ సభ్యులతో కలిసి ఆమె ముందుగా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సుబ్బారావు గాంధీజీ దేశానికి చేసిన సేవలను కొనియాడారు. ఉపసర్పంచ్ బూరెడ్డి రామునాయుడు, వార్డు సభ్యులు రమేశ్, అమరావతి, సచివాలయ సిబ్బంది, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

ఆది కర్మయోగితో పల్లెల్లో నాయకత్వం అభివృద్ధి: పీవో



వంట్లమామిడి గ్రామసభలో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో శ్రీపూజ

పాడేరు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): ఆది కర్మయోగి అభియాన్ అమలుతో గిరిజన పల్లెల్లో నాయకత్వం అభివృద్ధి చెందుతుందని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి టి.శ్రీపూజ అన్నారు. మండలంలో మినుములూరు, వంట్లమామిడి పంచాయతీ కేంద్రాల్లో శుక్రవారం నిర్వహించిన గ్రామసభల్లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రజలు, యువతలో నాయకత్వ లక్షణాలను పెంపొందించాలనే లక్ష్యంతోనే ఈ కార్యక్రమాన్ని కేంద్రం ప్రవేశ పెట్టిందన్నారు. ఇందులో భాగంగా ఎంపిక చేసిన గ్రామాల్లో గ్రామసభలను నిర్వహించి నాయకత్వ లక్షణాలపై అవగాహన కల్పించేందుకు ఇప్పటికే మాస్టర్ ట్రైనర్లను నియమించారు. వారంతా శుక్రవారం నుంచి 10 తేదీ వరకు అవగాహన కల్పిస్తారన్నారు. అలాగే, ప్రజలు ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలపై అవగాహన పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ ఏపీవో ఎం.వెంకటేశ్వరరావు, ఎంపీడీవో రతన్‌తేజ్, సచివాలయాల సిబ్బంది, మాస్టర్ ట్రైనర్లు, ప్రజలు పాల్గొన్నారు.

గిరి గ్రామాల అభివృద్ధికి పెద్దపీట : టీఎన్‌టీయూసీ



విలేకరులతో మాట్లాడుతున్న టీడీపీ, టీఎన్ఎస్ఎఫ్ నాయకులు

గూడెంకొత్తవీధి, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): గిరిజన గ్రామాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని టీఎన్ఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ముక్కలి కల్యాణి అన్నారు. శుక్రవారం పార్టీ కార్యకర్తలు సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ వైసీపీ గత ఐదేళ్ల పాలనలో గిరిజన గ్రామాలు అభివృద్ధిలో పదేళ్లు వెనక్కి వెళ్లిపోయాయరన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో అభివృద్ధికి ముందడుగు పడిందన్నారు. గిరిజన గ్రామాలకు తారు రోడ్లు, గ్రావెల్ రోడ్లు నిర్మాణమవుతున్నాయన్నారు. పీఎమ్ జన్‌మన్ పథకంలో అర్హులందరికీ పక్కా గృహాలు మంజూరు చేస్తున్నారన్నారు. పంచాయతీలకు ప్రత్యేక నిధులు కేటాయిస్తున్నట్టు చెప్పారు. పార్టీ కార్యకర్తలు ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకు వెళ్లాలని సూచించారు. టీడీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ కార్యదర్శి కొర్ర బలరామ్, నేతలు జర్ర వెంకట లక్ష్మి, వండలం బాలయ్య, ముక్కలి మహేశ్, చిన్నబ్బాయి, దేశగిరి పొట్టిపడాల్, శంకురయ్య పాల్గొన్నారు.

కొలంబంధలో తీరిన తాగునీటి సమస్య

చింతపల్లి, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదబరడ పంచాయతీ కొలంబంధలో తాగునీటి సమస్యను స్థానిక సర్పంచ్ సమిడి గోపాల్ చొరవతో పరిష్కారమైంది. ఈ గ్రామంలో సోలార్ మంచి నీటి పథకం మరమ్మతులతో స్థానిక గిరిజనులు ఆరు నెలలుగా నీటి సమస్యతో బాధపడుతున్నారు. తాజాగా ప్రభుత్వం పంచాయతీలకు నిధులు కేటాయించింది. దీంతో సర్పంచ్ చొరవ తీసుకుని శుక్రవారం కొత్త మోటార్‌ని ఏర్పాటు చేశారు.



పాడేరు ఉమానీలకంఠేశ్వస్వామి ఆలయంలోని దేవికి పూజలు



కనకదుర్గమ్మ ఆలయ విగ్రహం ఊరేగింపులో భవానీ మాలధారులు

ఘనంగా దసరా వేడుక

» ముగిసిన శరన్నవరాత్రులు.. దుర్గాదేవి అనుపోత్సవాలు

పాడేరురూరల్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): దసరా వేడుకలు ఘనంగా నిర్వహించారు. అలాగే, శరన్నవరాత్రులు ముగియడంతో పాడేరులో అమ్మవారి అనుపు మహోత్సవాలను గురువారం పూర్తి చేశారు. ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలోని కనకదుర్గమ్మ ఆలయంలో ఆలయ కమిటీ గౌరవాధ్యక్షుడు కొట్టగుళ్లి సుబ్బారావు, అధ్యక్షుడు రొబ్బి రాము ఆధ్వర్యంలో విగ్రహం ఏర్పాటు చేసి 9 రోజులపాటు పూజలను నిర్వహించారు. గురువారం సాయంత్రం అమ్మవారి విగ్రహాన్ని బాణసంచా, బ్యాండ్ మేళాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో ఊరేగింపుగా తీసుకువెళ్లి అనుపు ఉత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ ప్రతినిధులు, గ్రామ పెద్దలు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఉమానీలకంఠేశ్వరస్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి విగ్రహం అనుపోత్సవాన్ని ఆలయ ధర్మకర్త కొట్టగుళ్లి సింహాచలం నాయుడు, ఆధ్యాత్మిక సేవా బృంద సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు, ఆధ్యాత్మిక సేవాబృంద సభ్యులు హాజరయ్యారు.

ముంచంగిపుట్టు: మండల పరిధిలో గ్రామాల్లో విజయదశమిని ఘనంగా జరిపారు. దుర్గాదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక దుర్గాదేవి ఆలయ ప్రాంగణంలో మోటార్ యూనియన్ ఆధ్వర్యంలో గురువారం దుర్గాదేవి ప్రతిమను ఏర్పాటు చేశారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి, భక్తులకు ప్రసాదం అందించారు. ఆదివారం దుర్గాదేవి నిమజ్జన కార్యక్రమం ఉంటుందని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. దసరా రోజున దుర్గాదేవి ఆలయంలో భక్తులు కోలాటం ఆకట్టుకుంది.

అనాదీశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు

చింతపల్లి: దసరా శరన్నవరాత్రులు పురస్కరించుకుని అంతర్ల అనాదీశ్వర ఆలయంలో రాజరాజేశ్వరిదేవికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదపండితులు మంత్రోచ్ఛరణాలతో అభిషేకలు, కుంకుమార్చన, హోమం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తల్లి ఆశీస్సులు పొందారు. భక్తులకు అన్న సమారాధన ఏర్పాటు చేశారు. అనాదీశ్వర ఆలయం నిర్వాహకురాలు శివమాతాజీ, ప్రధాన అర్చకుడు వినోద్, ఏఎంసీ డైరెక్టర్ పెదిరెడ్ల బేతాళుడు, కమిటీ సభ్యులు గంజారి రమణ, సాగిన నాగార్జున పాల్గొన్నారు.

సీలేరు: జీకేవీధి మండలం సీలేరు, ధారకొండల్లో విజయదశమి వేడుకలను జరిపారు. దేవీ నవరాత్రి మహోత్సవాలు చివరి రోజు కావడంతో గురువారం సీలేరులోని సన్నిధికి పరిసర ప్రాంతాలకు చెందిన గిరిజనులు అధిక సంఖ్యలో వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. విజయదశమి పురస్కరించుకుని స్థానిక జలవిద్యుత్ కేంద్రంలో, జెన్‌కో కార్యాలయాల్లో యంత్ర సామగ్రికి పూజా కార్యక్రమాలను నిర్వహించారు.



విజయవాడ వెళ్తున్న సీలేరుకు చెందిన భవానీ భక్తులు



చింతపల్లిలో నిర్వహిస్తున్న రాజరాజేశ్వరిదేవికి హోమంలో భక్తులు




ముంచంగిపుట్టు ఆలయ ప్రాంగణంలో కోలాటం ప్రదర్శన

పాణిరంగిణి-బెంజిపూర్ మధ్య ట్రాఫిక్ జామ్

» రహదారి అధ్వానంతో సమస్యలు

అరకులోయ, అక్టోబరు3 (ఆంధ్రజ్యోతి): అరకులోయ- విశాఖపట్నంకు వెళ్లేమార్గంలో పాణిరంగిణి- బెంజిపూర్‌కు మధ్య ఆర్‌అండ్‌బీ రహదారి గోతులమయం కావడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఇక్కడి గోతుల్లో వర్షం నీరునిలిచి రహదారి దెబ్బతింది. ఈ స్థితిలో వాహనాలు నెమ్మదిగా వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. రహదారికి ఇరువైపులా వాహనాలు శుక్రవారం బారులుతీరాయి. ఇరువైపులా నీటి ప్రవాహం రోడ్డుపైకి రాకుండా కాలువలు నిర్మించకపోవడంతో సమస్య నెలకొంటోంది. ఆర్‌అండ్‌బీ అధికారులు చొరవ తీసుకొని పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టాలని వాహన చోదకులు డిమాండ్ చేస్తున్నారు.



శుక్రవారం సాయంత్రం నిలిచిన వాహనాలు

రాష్ట్ర స్థాయి టేబుల్ టెన్నిస్ విజేతకు సన్మానం

గూడెంకొత్తవీధి, అక్టోబరు 3 (ఆంధ్ర జ్యోతి): రాష్ట్ర స్థాయి ఏకలవ్య ఆదర్శ నివాసానుబంధ పాఠశాలల అండర్-19 టేబుల్ టెన్నిస్‌లో గోల్డ్ మెడల్ సాధించిన గిరిజన విద్యార్థిని ప్రజాప్రతినిధులు, గ్రాస్థులు ఘనంగా సన్మానించారు. లక్కవరపుపేటకు చెందిన కంకిపాటి హరి ప్రసాద్ ఏకలవ్య ఆదర్శ నివాసానుబంధ పాఠశాలలో విద్యాభ్యాసం చేస్తున్నాడు. గత నెలలో జరిగిన రాష్ట్ర స్థాయి క్రీడల్లో విద్యార్థి అండర్-19 టేబుల్ టెన్నిస్‌లో ప్రథమ స్థానం సాధించి గోల్డ్ మెడల్ సొంతం చేసుకున్నాడు. సెలవులకు స్వగ్రామానికి వచ్చిన ఆ విద్యార్థి క్రీడా ప్రతిభను అభినందిస్తూ సర్పంచ్ పండు, ఉప సర్పంచ్ గంగాధర్, నాయకులు గోపాలరావు, భద్రంపడాల్, చంటిబాబు, శివరాత్రి నారాయణరావు, కొర్ర రమణలు ఘనంగా సత్కరించారు.



విద్యార్థి హరిప్రసాద్‌ని సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు

మహిళా సంఘాల సభ్యులకు స్వయం ఉపాధి యూనిట్లు

» పాలు, అనుబంధ ఉత్పత్తులపై జీఎస్టీ తగ్గింపు

» జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ జయరాజు

చింతపల్లి, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): స్వయం సహాయక సంఘాల సభ్యులకు స్వ యం ఉపాధి యూనిట్లు అందజేయనున్నట్టు జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ వి. జయరాజు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో సబ్ డివిజన్ పరిధి పశుసంవర్ధకశాఖ వైద్యులు, ఉద్యోగులతో జీఎస్టీ తగ్గింపుపై అవగాహన సమావేశం నిర్వహించారు. తొలుత గ్రామంలో ర్యాలీ చేశారు. అనంతరం జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి మాట్లాడుతూ ఎన్డీయే కూటమి ప్రభుత్వం జీఎస్టీ తగ్గించిసామాన్య, మధ్యతరగతి ప్రజలకు మేలు చేసిందన్నారు. పాలుపై గతంలో ఐదుశాతం జీఎస్టీ ఉండేదని, ప్రస్తుతం ప్రభుత్వం పూర్తిగా తొలగించిందన్నారు. దీంతో లీటరుకి రూ.మూడు ధర తగ్గిందన్నారు. వెన్న, నెయ్యిపై గతంలో 12శాతం ఉన్న జీఎస్టీ ప్రస్తుతం 5శాతానికి పరిమితం చేసినట్టు చెప్పారు. పాడి రైతులకు ఉపయోగపడే పాల క్యాన్‌లు, పాలు సేకరణ యంత్రాలు, దాణా, మందులపై భారీగా 12శాతం ఉన్న జీఎస్టీని ప్రభుత్వం 5శాతానికి తగ్గించిందన్నారు. నిత్యావసరాలు, వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్ధక, చేపలు పెంపకంపై ప్రజలు ఉపయోగించిన యంత్రాలు, ఉత్పత్తులపై జీఎస్టీ భారీగా తగ్గినట్టు చెప్పారు. అలాగే పశువుల చేసే బీమాపై జీఎస్టీనీ పూర్తిగా తొలగించిందన్నారు. గతంలో బీమా ప్రీమియంతోపాటూ అదనంగా జీఎస్టీ చెల్లించేవారన్నారు. ప్రస్తుతం జీఎస్టీ అవసరంలేదన్నా రు. ప్రభుత్వం కల్పించిన జీఎస్టీ మినహాయింపుపై ప్రజలు చైతన్యవంతులు కావాలన్నారు. జిల్లాలోని డ్వాక్రా సభ్యులకు 5,326 స్వయం ఉపాధి యూనిట్లు మంజూరు చేస్తున్నామన్నారు. డ్వాక్రా సభ్యులకు పాడిగేదెలు, ఆవులు, బాతులు, కోళ్లు, ఎడ్లు అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో పశుసంవర్ధశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ పి.చంద్రశేఖరరావు, ఎంపీడీవో సీహెచ్. సీతామహాలక్ష్మి, పశువైద్యాధికారులు డాక్టర్ లోకుల రమేశ్, డాక్టర్ చల్లంగి చాలిని, డాక్టర్ మత్స్యరాస సౌజన్యదేవి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ జయరాజు

జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌పై అవగాహన ఉండాలి

జి.మాడుగుల: సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని స్థానిక ఎంపీడీవో ఎస్. డేవిడ్‌రాజు సూచించారు. మండలంలోని నుర్మతి పంచాయతీలో శుక్రవా రం ఆయన పర్యటించారు. సర్పంచ్ సూరిబాబుతో కలిసి నుర్మతి పరిసర గ్రామాలను సందర్శించి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. దుకాణాల్లో వస్తువులు కొనుగోలు చేసేటప్పుడు జీఎస్టీ సూచనలు పాటించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

'కూటమి పాలనలో విద్యకు ప్రాధాన్యం'



పాఠశాల భవన నిర్మాణాలకు శంకుస్థాపన చేస్తున్న మార్కెట్ కమిటీ డైరెక్టరు రాజేశ్వరి

కొయ్యూరు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): మారుమూల కొండలపై గల గ్రామాలలో సైతం పాఠశాలల్లో వసతుల కల్పనకు కూటమి ప్రభుత్వం నిధులు కేటాయించటం హర్షించతగిన విషయమని చింతపల్లి మార్కెట్ కమిటీ డైరెక్టర్ జి.రాజేశ్వరి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలో మూలపేట పంచాయతీలో మూలలపేట, రామాపురంలలోని ఎంపీ ఎలిమెంటరీ పాఠశాల భవన నిర్మాణాలకు రాజేశ్వరి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సర్వశిక్ష శిక్ష అభియాన్ నిధులతో ఈ భవన నిర్మాణాలు చేపడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రావుల వెంకట లక్ష్మి, తెలుగు మహిళా నేత బి. సత్యవతి, వీఆర్పీ సింహాచలం, పెసా కమిటీ ఉపాధ్యక్షుడు రాజబాబు, పా ఠశాల విద్యాకమిటీ చైర్మన్ నాగమణి, ఆయా గ్రామాల ప్రజలు తదితరులు హాజరయ్యారు.

విద్యార్థులకు ప్రోత్సాహకాలు



ఈఎంఆర్ఎస్‌కు ఎంపికైన విద్యార్థులకు బ్యాగ్‌లు, ప్రోత్సాహకాన్ని అందిస్తున్న గ్రామ పెద్దలు

కొయ్యూరు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి):వేసవి సెలవుల్లో విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నట్టు తోటలూరుకు చెందిన ప్రస్తుత సబ్బవరం మండల విద్యాశాఖాధికారి శ్యామల లక్ష్మణరావు పేర్కొన్నారు. రావణాపల్లి సచివాలయ పరిధి రెండు పంచాయతీలలో ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలకు ఎంపికైన సుమారు 25 మంది విద్యార్థులనుతోటలూరుకు చెం దిన ప్రస్తుతం కొమ్మిక ఆశ్రమ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు శ్యామల వీర్రాజు.. ప్రభుత్వ ఉ ద్యోగుల సహకారంతో బ్యాగులతోపాటు ప్రోత్సాహకాలను టీడీపీ మండల అధ్యక్షుడు కాకర చంద్రరావు చేతుల మీదుగా గురువారం అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు పొడుగు చంద్రరావు, మాదల బాలరాజు, లువ్వా రాజు, పొడుగు కుశరాజు, పొడుగు శ్రీను పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి అధిక నిధులు



పంచాయతీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ లక్ష్మణ్

ముంచంగిపుట్టు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యపడుతుందని వనభసింగి పంచాయతీ సర్పంచ్ వి.లక్ష్మణ్ అన్నారు. గ్రామంలో రాష్ట్రీయ గ్రామ్ స్వరాజ్ అభియాన్, ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.32 లక్షలతో చేపట్టనున్న పంచాయతీ భవన నిర్మాణ పనులకు ఆయన శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతు గిరిన ప్రాంత అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందన్నారు. ఎన్నడూ లేని పలు అభివృద్ధి పనులు సాగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నేతలు కె.జగత్‌రాయ్, పి.కామేశ్వరరావు, బి.రామారావు, జి.సతీశ్, జి.సోనాదోర్, జి.సతీశ్, తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుతో రైతులకు ఊరట: ఎంపీడీవో

గూడెంకొత్తవీధి: వ్యవసాయ యంత్రాలు, ఎరువులపై ఎన్డీయే కూటమి ప్రభుత్వం జీఎస్టీ తగ్గించిందని ఎంపీడీవో రమణబాబు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రైవేటు దుకాణాల డీలర్లు జీఎస్టీ తగ్గింపుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ప్రభుత్వం 12శాతం ఉన్న వ్యవసాయ యంత్రాలపై జీఎస్టీని ప్రస్తుతం ఐదుశాతానికి తగ్గించిందన్నారు. అలాగే డ్రోన్లపై 13శాతం, టార్పాలిన్లు, బిందు సేద్యంపై ఏడు శాతం తగ్గించిందన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి డి. గిరిబాబు, ఏసీ టీవో గోవిందరావు, ఏపీవో రాంప్రసాద్, సర్పంచ్ సుభద్ర పాల్గొన్నారు.

వినతులను త్వరితగతిన పరిష్కరించాలి : కలెక్టర్

» ఐటీడీఏలోని పీజీఆర్ఎస్‌కు 67 వినతులు

పాడేరు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ(మీకోసం) కార్యక్రమంలో స్వీకరించిన వినతుల పరిష్కారాన్ని వేగవంతం చేయాలని కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ అధికారులను ఆదేశించారు. స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మీకోసంలో ఆయన మాట్లాడారు. ప్రజల నుంచి స్వీకరించిన వినతులపై స్వయంగా విచారణ చేపట్టి పరిష్కార దిశగా చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం గిరిజనుల నుంచి జిల్లాకలెక్టర్, జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎంజే.అభిషేక్‌గౌడ, అసిస్టెంట్ కలెక్టర్ సాహిత్, డీఆర్‌వో కె.పద్మలత 67 వినతులను స్వీకరించారు. హుకుంపేట మండలం మత్స్యపురంలోని వీధులకు సిమెంట్ కాంక్రీట్ రోడ్లు మంజూరు చేయాలని ఉప సర్పంచ్ పి.చంద్రన్నపాత్రుడు కోరగా, తమ గ్రామంలో శిథిలమైన అంగన్‌వాడీ భవనం స్థానంలో కొత్త భవనం నిర్మించాలని ముంచంగిపుట్టు మండలం కొండపడ గ్రామస్థులు కె.బాలరాజు, పి.రామచంద్రరావు, పి.సొన్ను కోరారు. అలాగే, కొయ్యూరు మండలంలో ఆడాకుల పంచాయతీ డి.కొత్తూరుకు త్రీఫేజ్ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని కె. స్వాతికుమార్ కోరారు. డుంబ్రిగుడ మండలం గసభ పంచాయతీ సిమిలిగూడ గ్రామం నుంచి సిరసగూడ వరకు తారురోడ్డు వేయాలని సర్పంచ్ ఎస్.సునీత కోరారు. ముంచంగిపుట్టు మండలం పెదగూడకు చెందిన టి.మనిత్ సికిల్ సెల్ ఎనీమియాతో బాధపడుతున్నాడని, ఆర్థిక సహాయం చేయాలని తల్లిదండ్రులు కోరారు.



ఐటీడీఏలో వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ దినేశ్‌కుమార్, ఇతర అధికారులు

1100 కాల్ సెంటర్ సేవలు వినియోగించుకోవాలి

అర్జీదారులు తమ సమస్యలు పరిష్కారానికి నోచుకోకుంటే 1100 నంబర్‌కు ఫోన్ చేసి స్థితిగతులను తెలుసుకోవాలని కలెక్టర్ దినేశ్‌కుమార్ అన్నారు. ఈ విధంగా చేసుకుంటే తమ సమస్య ఎంతవరకు పరిష్కారమయ్యేందో తెలుసుకోవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ వి.మురళీ, సమగ్ర శిక్ష ఏపీసీ స్వామినాయుడు, డీఈవో పి.బ్రహ్మాజీరావు, గిరిజన సంక్షేమ శాఖ డీడీ పరిమళ, జిల్లా పంచాయతీ అధికారి చంద్రశేఖర్, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ ఈఈ టి.కొండయ్యపడాల్, గ్రామ సచివాలయాల నోడల్ అధికారి పీఎస్.కుమార్, జాతీయ రహదారుల డిప్యూటీ తహశీల్దార్ వి.ధర్మరాజు, జిల్లా వ్యవసాయాధికారి ఎస్‌బీఎస్.నందు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అరకొర ఆర్టీసీ బస్సులతో పాట్లు

» దసరా ప్రయాణికుల అవస్థలు

» కొన్ని సర్వీసులు మొరాయింపు..

మరికొన్ని విజయవాడకు మళ్లింపు

సీలేరు, అక్టోబరు 3 , (ఆంధ్రజ్యోతి): జీకేవీధి మండలం సీలేరు, ధారకొండ, దొంకరాయి, ప్రాంతాల ప్రయాణికులకు శుక్రవారం బస్సులు అందుబాటులో లేక తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. దసరా సెలవులు గురువారంతో ముగియడంతో శుక్రవారం గ్రామాలనుంచి పలువురు తిరుగు ప్రయాణమయ్యారు. ఈ నేపథ్యంలో బస్సులు లేక అవస్థలకు లోనయ్యారు. విశాఖ డిపోకు చెందిన విశాఖ- సీలేరు నైట్ హాల్ట్ బస్సును పీటీడీ అధికారులు రద్దు చేశారు. అలాగే శుక్రవారం నర్సీపట్నం డిపోనకు చెందిన నర్సీపట్నం- సీలేరు రెండు బస్సుల్లో ఒకటి ధారకొడ ఘాట్‌లో సాంకేతిక లోపాలు తలెత్తి నిలిచిపోగా, మరొక బస్సును భవానీ భక్తుల కోసం విజయవాడకు మళ్లించడంతో ఈ ప్రాంత ప్రయాణికులకు ఇబ్బందులు తప్పలేదు. ఈ ప్రాంతానికి అరకొరగా ఉన్న సర్వీసులను పండగ పేరుతో వేరే ప్రాంతానికి మళ్లించడం ఎంతవరకు సమంజసమని పలువురు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉన్న ఒకటి రెండు రెగ్యులర్ బస్సులను యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేస్తున్నారు.

పాడేరు ఘాట్‌లో నిలిచిన బస్సు

పాడేరురూరల్: విశాఖపట్నం నుంచి వస్తున్న ఆర్టీసీ బస్సు పాడేరు ఘాట్ మార్గంలో 12వ మైళ్ల గ్రామ సమీపంలో శుక్రవారం ఉదయం నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందికి గురయ్యారు. మరో బస్సు వచ్చేంత వరకు సుమారు 2 గంటల పాటు నిరీక్షించాల్సి రావడంతో పలువురు అసహనం వ్యక్తం చేశారు. విశాఖపట్నం డిపోనకు ఈ బస్సు ప్రతి రోజూ ఉదయం విశాఖ నుంచి పాడేరుకు వస్తుంది. గత నెల రోజులుగా ఈ బస్సు పాడేరు ఘాట్‌లో ఏదో ఒక చోట మరమ్మతులకు గురై నిలిచిపోతోంది. పాడేరు ఘాట్‌లో ఈ నెల 1, 2వ తేదీల్లోనూ ఘాట్‌లో స్వల్ప మరమ్మతులతో నిలిచిపోయినట్లు ఆర్టీసీ సిబ్బంది చెబుతున్నారు. తరచూ నిలిచిపోతున్న విషయం విశాఖ డిపో అధి కారులకు తెలిసినా, ఇదే బస్సును పాడేరు ఘాట్ మార్గానికి పంపించడంపై ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఇకనైనా కండీషన్‌లో ఉన్న బస్సులను ఘాట్ మార్గానికి పంపాలని కోరుతున్నారు.



పాడేరు ఘాట్ రోడ్డులో నిలిచిన బస్సు



ధారకొండ రోడ్డులో నడిచివస్తున్న ప్రయాణికులు

రహదారులు ఛిద్రం.. రాకపోకలు ప్రమాదకరం

రెండు నియోజకవర్గాలోని మండలాలను కలిపే ప్రధాన రహదారులు ఛిద్రమయ్యాయి. అడుగడుగునా గతుకులు ఏర్పడ్డాయి. వర్షాలకు నీరు చేరి చెరువులను తలపిస్తున్నాయి. ఫలితంగా వాటిని గుర్తించలేని దుస్థితికి చేరాయి. దీంతో రాకపోకలు ప్రమాదకరంగా పరిణమించాయి.

- అధ్వానంగా అంతర మండలాల రహదారులు
- చీడికాడ, దేవరాపల్లి మార్గాలు ఛిద్రం
- వర్షాలకు చెరువులను తలపిస్తున్న వైనం
- వాహన చోదకులు, ప్రయాణికులకు నరకం


అన్నవరం సమీపంలో ఛిద్రమైన చోడవరం-దేవరాపల్లి రోడ్డు

చోడవరం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): అసలే అంతంతమాత్రంగా ఉన్న చోడవరం, మాడుగుల నియోజకవర్గాలను కలిపే ప్రధాన రహదారులు ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మరింత దారుణంగా తయారయ్యాయి. ఈ రెండు నియోజకవర్గాలను కలిపే చోడవరం-చీడికాడ, చోడవరం-దేవరాపల్లి మార్గాలు ప్రస్తుతం అధ్వానంగా మారిపోయాయి. ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు కనీస మరమ్మతులు చేపట్టకపోవడంతో ఈ రహదారులు గుంతలమయంగా తయారయ్యాయి. చోడవరం నుంచి చీడికాడ వెళ్లే రహదారి పట్టణ పరిధిలోని పూర్ణా థియేటర్, ఐటీఐ కాలనీల వద్ద దారుణంగా దెబ్బతిన్నాయి. వాన నీరు ఈ రోడ్డుపై నుంచే ప్రవహిస్తుండడంతో ఆద్యంతం చెరువులను తలపించేలా మారిపోయింది. ఈ రూట్లో ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి ఐటీఐ కాలనీ వరకు, అక్కడ నుంచి ఈపీడీసీఎల్ కార్యాలయం వరకు ప్రధాన రహదారి దారుణంగా దెబ్బతింది. గత ఏడాది వరకు చక్కగా ఉన్న ఈ రోడ్డు ఈ ఏడాది ఘోరంగా తయారుకావడం, గోతులన్నీ పెద్దగా మారిపోవడంతో వాహనదారులు ఈ గోతుల్లో పడి ప్రమాదాలపాలవుతున్నారు.


ఐటీఐ కాలనీ వద్ద దారుణంగా దెబ్బతిన్న చోడవరం-చీడికాడ రోడ్డు

ఇక చోడవరం నుంచి అన్నవరం మీదుగా దేవరాపల్లి వెళ్లే ప్రధాన రహదారి అన్నవరం వద్ద, రేవళ్ల సమీపంలో పూర్తిగా దెబ్బతింది. వర్షాలకు ఈ గుంతల్లో నీరు నిల్వ ఉండిపోయి వాహనదారులు తప్పించుకునే అవకాశం లేకుండా పోతోంది. ఈ రహదారుల్లో గుంతలను కప్పినట్టయితే సమస్య ప్రాథమిక స్థాయిలోనే తీరిపోయేది. కాని, ఆర్‌అండ్‌బీ అధికారులు కనీసం పట్టించుకోకపోవడంతో ఈ గుంతలు మరింతగా పెరిగి రోడ్డు పూర్తిగా శిథిలమై ప్రమాదకరంగా తయారైంది. ఫలితంగా వాహన చోదకులు, ప్రయాణికులు బిక్కుబిక్కుమంటూ రాకపోకలు సాగిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి చోడవరం, మాడుగుల నియోజకవర్గాలను కలిపే చోడవరం-చీడికాడ, చోడవరం-దేవరాపల్లి రహదారులను అభివృద్ధి చేయాలని రెండు నియోజకవర్గాల ప్రజలు, వాహన చోదకులు, ప్రయాణికులు కోరుతున్నారు.


భూమి పట్టాలు అందజేస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

రైతుల చొరవ ప్రశంసనీయం

▸▸ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు

నర్సీపట్నం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రజా ప్రయోజనార్థం భూములు ఇవ్వడానికి రైతులు ముందుకు రావడం ప్రశంసనీయమని స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు పేర్కొన్నారు. శుక్రవారం తన క్యాంప్ కార్యాలయంలోనర్సీపట్నం రింగ్ రోడ్డు నిర్మాణానికి భూములు ఇవ్వడానికి 25 మంది రైతులకు ప్రత్యామ్నాయంగా భూ పట్టాలు ఇచ్చారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ భూములు ఇచ్చిన రైతుల త్యాగం ప్రశంసనీయమన్నారు. వారి సహకారంతో నర్సీపట్నం రింగ్ రోడ్డు నిర్మాణం ప్రాజెక్టు పనులు ముందుకు వెళ్తున్నాయన్నారు. భవిష్యత్తులోనూ ప్రజలు అదే స్ఫూర్తితో నర్సీపట్నం అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వీవీ రమణ, తహశీల్దార్ రామారావు, రైతులు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు


శిక్షణ కార్యక్రమాల పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రాజు

చోడవరం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు వివిధ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్టు ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు తెలిపారు. కేంద్ర మానవ వనరుల మంత్రిత్వ సహకారంతో నిరుద్యోగ యువతకు సీడ్‌ఏపీ ద్వారా శిక్షణ ఇస్తామన్నారు. ఈ కోర్సులకు సంబంధించిన పోస్టర్‌ను తన కార్యాలయం వద్ద శుక్రవారం ఆయన ఆవిష్కరించారు. నియోజకవర్గంలో 18 నుంచి 35 ఏళ్ల లోపు పది లేదా అంతకు మించి విద్యార్హత కలిగిన నిరుద్యోగ యువతీ, యువకులు ఆన్‌లైన్‌లో తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. శిక్షణ కాలంలో నిరుద్యోగులకు ఉచితంగా వసతి, భోజన సౌకర్యాలతో పాటు యూనిఫాం, కిట్‌లు కూడా అందిస్తారన్నారు. శిక్షణకు సంబంధించి పూర్తి వివరాల కోసం 7013228982 నంబర్‌కు సంప్రదించాలని ఎమ్మెల్యే కోరారు. ఈ కార్యక్రమంలో పవర్ సొల్యూషన్ ఎండీ పిళ్లా రమేశ్ పాల్గొన్నారు.

అథ్లెటిక్స్‌లో వేచలం విద్యార్థిని ప్రతిభ

దేవరాపల్లి, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేచలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థిని బడబడల చైతన్య అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ కనబర్చింది. గుంటూరులో జరిగిన అండర్-16 బాలికల విభాగంలోని స్టేట్ జూనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ పోటీల్లో రెండో స్థానంలో నిలిచినట్టు హెచ్‌ఎం పి.వెంకటరావు తెలిపారు. ఈ మేరకు విద్యార్థిని చైతన్యను హెచ్‌ఎంతో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.

శివశక్తి క్షేత్రంలో సినీనటుడు శుభలేఖ సుధాకర్ పూజలు


చిక్కుడుపాలెం భూగర్భ శివాలయంలో పూజలు చేస్తున్న సినీనటుడు శుభలేఖ సుధాకర్

నాతవరం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుమ్మిడిగొండ పంచాయతీ శివారు చిక్కుడుపాలెంలో కొలువైన శివశక్తి క్షేత్రంలోని భూగర్భ శివాలయంలో గురువారం సినీనటుడు శుభలేఖ సుధాకర్ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి విగ్రహానికి నాగబంధం ప్రతిష్ఠ చేశారు. ఈ సందర్భంగా సినీనటుడు శుభలేఖ సుధాకర్ మాట్లాడుతూ ఈ ఆలయంలో ఏదో అద్భుత శక్తి ఉందన్నారు. స్వామివారిని దర్శించుకున్న తర్వాత తనకెంతో ప్రశాంతత వచ్చిందన్నారు. త్వరలో తన భార్య ఎస్పీ శైలజతో కలసి భూగర్భ శివాలయాన్ని సందర్శిస్తానని తెలిపారు. అనంతరం ఆలయ ధర్మకర్త శర్మ, గౌరవ ఆలయ ధర్మకర్త పోలుపర్తి శ్రీనివాసరావు శుభలేఖ సుధాకర్‌ని శాలువకప్పి సత్కరించారు.

మలేరియా, చికున్ గున్యా వ్యాప్తి నియంత్రణకు చర్యలు

▸▸ జిల్లా మలేరియా అధికారి డి.దొర


జుత్తాడలో మలేరియా నియంత్రణ కార్యక్రమాలపై వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా మలేరియా అధికారి దొర

చోడవరం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): వర్షాలు విస్తారంగా పడుతున్నందున గ్రామాల్లో మలేరియా, చికున్ గున్యాల నియంత్రణకు పక్కా చర్యలు చేపట్టాలని జిల్లా మలేరియా అధికారి డి.దొర వైద్య సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం మండలంలోని జుత్తాడ గ్రామాన్ని ఆయన ఆకస్మికంగా సందర్శించారు. గ్రామంలో ఎడిస్ లార్వా సర్వేపై ఆరా తీశారు. ఈ సందర్భంగా దోమల నిర్మూలనకు ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని, మలేరియా, డెంగ్యూ, చికున్ గున్యా వ్యాధులపై స్థానికులకు అవగాహన కల్పించారు. నీరు నిల్వ ఉండకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎంవో సత్యనారాయణ, మలేరియా సబ్ యూనిట్ అధికారి ఎస్వీ. రమణ, హెచ్‌ఈ సింహాచలం, త్రిమూర్తులు, హెల్త్ అసిస్టెంట్ నాని, ఏఎన్‌ఎం, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో దసరా ఉత్సవాలు



అమ్మవారిని దర్శించుకుంటున్న స్పీకర్‌అయ్యన్నపాత్రుడు, పద్మావతి దంపతులు.... దేవరాపల్లిలో సాంస్కృతిక కార్యక్రమాలు

నర్సీపట్నం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): దసరా పండుగను ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నర్సీపట్నంలోని దుర్గామల్లేశ్వరస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. స్పీకర్ అయ్యన్నపాత్రుడు, పద్మావతి దంపతులు అమ్మవారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యులు స్పీకర్‌కు అమ్మవారి చిత్రపటం కానుకగా అందజేశారు. అనంతరం ఆయన భక్తులకు అన్నప్రసాదాన్ని స్వయంగా వడ్డించారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. 25 వేల మంది అన్నప్రసాదం పంపిణీ చేయడం విశేషమన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రాజశేఖర్, ఆలయ కమిటీ చైర్మన్ నాగేంద్రరాజు పాల్గొన్నారు.

మాడుగులలో...

మాడుగుల: మండల కేంద్రంలో శరన్నవరాత్రి ఉత్సవాలు గురువారం ఘనంగా జరిగాయి. ఉదయం నుంచి ఎడతెరిపిలేని వర్షం కురిసినా ఆలయాలకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

దేవరాపల్లిలో...

దేవరాపల్లి: మండలంలోని అన్ని గ్రామాల్లో దుర్గా నవరాత్రులు ఘనంగా జరిగాయి. గురువారం రాత్రి అమ్మవారి ప్రతిమను సాంస్కృతిక కార్యక్రమాల నడుమ ఘనంగా ఊరేగించారు. నాగయ్యపేట, సీతంపేట, ములకలాపల్లి, బి.కింతాడ గ్రామాల్లో ఊరేగింపులు జరిగాయి. దేవరాపల్లిలో లౌలీ బాయస్ ఆధ్వర్యంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు ఏర్పాట్లను పరిశీలించారు.

గొలుగొండలో...

గొలుగొండ: మండలంలోని కనకదుర్గాదేవి నిమజ్జన కార్యక్రమం ఘనంగా జరిగింది. గొలుగొండ, ఎర్రవరం, చీడిగుమ్మల, ఏటిగైరంపేట, పాకలపాడు, కొత్తఎల్లవరం, శ్రీరాంపురం గ్రామాల్లో గురువారం రాత్రి అమ్మవారి విగ్రహాలను ఘనంగా ఊరేగించారు. భవానీ భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

చీడికాడలో...

చీడికాడ: మండలంలోని అప్పలరాజుపురం, చీడికాడ తదితర గ్రామాల్లో విజయదశమి ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. అప్పలరాజుపురం లలితాదేవి ఆలయానికి, చీడికాడ దుర్గాదేవి పీటానికి వందలాది మంది భక్తులు తరలివచ్చి పూజలు చేశారు. దేవీ మెట్టపై భారీ అన్న సమారాధన నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ చుక్క అప్పలనాయుడు ఆధ్వర్యంలో సాయంత్రం కోలాటాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఖండివరంలో భవానీ భక్తులు అమ్మవారి సారెను ఘనంగా ఊరేగించారు.

అల్లర్లు సృష్టిస్తే రౌడీషీట్ తెరుస్తాం..

▸▸ అనకాపల్లి డీఎస్పీ శ్రావణి


విలేకరులతో మాట్లాడుతున్న అనకాపల్లి డీఎస్పీ శ్రావణి

దేవరాపల్లి, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో అల్లర్లు సృష్టించాలని ప్రయత్నిస్తే రౌడీషీట్లు తెరుస్తామని అనకాపల్లి డీఎస్పీ ఎం.శ్రావణి హెచ్చరించారు. వాట్సాప్ చాటింగ్‌లో ఇద్దరి మధ్య జరిగిన వివాదాస్పద వ్యాఖ్యలు గురువారం రాత్రి కొట్లాటకు దారితీసి, ఇరు వర్గాల వారు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదులు చేసుకున్నారు. దీనిపై డీఎస్పీ శుక్రవారం ఇక్కడికి వచ్చి విచారణ చేపట్టారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకొని ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తే సహించేది లేదని, రాజకీయ ముసుగులో రౌడీయిజం చేస్తే ఉపేక్షించబోమని ఇరు వర్గాల వారిని హెచ్చరించారు. ప్రజల్లో రాజకీయ కక్షలు ప్రేరేపించే వారిపై చర్యలు తప్పవన్నారు. అనంతరం విలేకరులతో ఆమె మాట్లాడుతూ ఈ ఘటనలకు కారకులైన రెండు వర్గాలకు చెందిన పది మందిపై కేసులు నమోదు చేసినట్టు తెలిపారు. అలాగే వారిని బైండోవర్ చేయాలని ఎస్‌ఐను ఆదేశించినట్టు తెలిపారు. ఎ.కోడూరు ఎస్‌ఐ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో సామగ్రి దగ్ధం

రావికమతం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): చినపాచిల పంచాయతీ శివారు మత్స్యపురం గ్రామంలోని మామిడి దేముడు ఇంట్లో గురువారం సాయంత్రం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగి సామగ్రి కాలి బూడిదయ్యాయి. ఇంట్లో మంటలు వ్యాపించి దట్టంగా పొగలు పైకి రావడంతో స్థానికులు పరుగులు తీశారు. రావికమతం అగ్నిమాపక సిబ్బంది సమాచారం ఇవ్వడంతో, వారు హుటాహుటిన సంఘటనా చేరుకుని మంటలను ఆర్పారు. అప్పటికే ఇంట్లో ఉన్న ఫ్రిజ్, టీవీ, బట్టలు, వంట పాత్రలు, తిండి గింజలు కాలి బూడిదయ్యాయి. రూ.1.5 లక్షలకు పైగా ఆస్తి నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు దేముడు కోరారు.

రహదారులు నిర్మించాలని గిరిజనుల నిరసన

మాడుగుల రూరల్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): రహదారులు నిర్మించాలని డిమాండ్ చేస్తూ ఉరకగెడ్డలో గిరిజనులు శుక్రవారం జలదీక్ష చేపట్టారు. శంకరం పంచాయతీ పరిధిలోని తాడివలస, గొప్పూరు, రాయిపాలెం, రాంజపేట, వెలగలపాడు, కొత్తవలస, మామిడి పాలెం గ్రామాలకు వెళ్లాలంటే ఉరకగెడ్డను దాటాలని, వర్షాల సమయంలో ఇబ్బందులు పడుతున్నామని వారు వాపోయారు. వీరికి సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు డి.వెంకన్న, మండల కార్యదర్శి నరసింహమూర్తి మద్దతునిచ్చారు. అనంతరం వారు మాట్లాడుతూ గిరిజన గ్రామాలకు సరైన రోడ్డు, వంతెనలు లేక అవస్థలు పడుతున్నారన్నారని, వర్షాలు పడితే రాకపోకలు నిలిచిపోతున్నాయన్నారు. ప్రభుత్వం స్పందించి ఈ సమస్యలు పరిష్కరించాలని కోరారు. నాయకులు భవానీ, రమేశ్, కొండలరావు, అప్పారావు, ఈశ్వరరావు, చంద్ర పాల్గొన్నారు.

'పేదలకు సీఎం చంద్రబాబు అండ'

చీడికాడ, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): పేద కుటుంబాలకు సీఎం చంద్రబాబు అండగా ఉంటున్నారని మాజీ ఎంపీపీ కుచ్చు కళావతి చెప్పారు. మండలంలోని ఖండివరం గ్రామానికి చెందిన గౌరీశ్వర (9 నెలలు)కు అనారోగ్యం చేయడంతో విశాఖ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్చారని, వైద్య ఖర్చుల కోసం ఎంపీ సీఎం రమేశ్ ద్వారా రూ.2.32 లక్షలు సీఎంఆర్‌ఎఫ్ నుంచి మంజూరయ్యాయని చెప్పారు. ఈ మొత్తానికి సంబంధించి కొంత నగదును శుక్రవారం తల్లిదండ్రులకు అందించామన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు బండారు దయాకర్, చెరువూరి శివాజీరాజు, సింగంపల్లి పెద నాయుడు, శ్రీనాధు విజయ్, ఎస్‌వీఎస్.నాయుడు పాల్గొన్నారు.


సీఎం సహాయనిధి చెక్కు అందిస్తున్న నాయకులు

మహాత్ముని మార్గం అనుసరణీయం

▸▸ కలెక్టర్ విజయకృష్ణన్... గాంధీజీ, లాల్‌బహదూర్‌శాస్త్రిలకు నివాళులు


గాంధీ, లాల్‌బహదూర్‌శాస్త్రి చిత్రపటాల వద్ద నివాళులు అర్పిస్తున్న కలెక్టర్, అధికారులు

అనకాపల్లి కలెక్టరేట్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): అహింసే ఆయుధంగా దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన మహనీయుడు మహాత్మాగాంధీ అని, ఆయన మార్గం అనుసరణీయమని కలెక్టర్ విజయకృష్ణన్ అన్నారు. జాతిపిత మహాత్మాగాంధీజీ 156వ జయంతి, భారత దేశ రెండో ప్రధానమంత్రి లాల్ బహదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా గురువారం కలెక్టరేట్‌లో వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, సుపరిపాలన ద్వారా గ్రామ స్వరాజ్య స్థాపన జరగాలని గాంధీజీ కలలు కన్నారని, వాటిని సాకారం చేయాల్సిన బాధ్యత మనందరిపైనా వుందని అన్నారు. సత్యమే దైవమని, సత్యాన్నే ఆయుధంగా ఎంచుకోవాలని గాంధీజీ బోధించారన్నారు. అహింస ద్వారా ఏదైనా సాధించవచ్చని నిరూపించని మహనీయుడు అని కొనియాడారు. శాంతి సందేశాన్ని అందించవచ్చని నిరూపించారు. లాల్‌బహదూర్‌శాస్త్రి జై జవాన్.. జై కిసాన్ నినాదంతో రైతులకు ఎన్నో సేవలు అందించారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో వై.సత్యనారాయణరావు, కలెక్టరేట్ ఏవో విజయ్, సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలు


పోటీల ఏర్పాట్లపై చర్చిస్తున్న డీఎస్పీ, నిర్వాహకులు

కృష్ణాదేవిపేట, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): గొలుగొండ మండలంలోని కృష్ణాదేవిపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం నుంచి రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలు జరగనున్నాయి. ఈ పోటీలకు శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, మంత్రి వంగలపూడి అనిత, ఎంపీ సీఎం రమేశ్, డీజీపీ హరీశ్‌గుప్తా ప్రారంభిస్తారు. ఇందుకు సంబంధించి క్రీడా మైదానం, సభా వేదిక, ఇతర భద్రతా ఏర్పాట్లను డీఎస్పీ పి.శ్రీనివాసరావు, రూరల్ సీఐ ఎల్.రేవతమ్మ, ఎస్‌ఐ వై.తారకేశ్వరరావు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ఈ పోటీలకు అన్ని జిల్లాల నుంచి సుమారు 400 మంది క్రీడాకారులు వచ్చారన్నారు. అలాగే నాతవరం, కృష్ణాదేవిపేట, గొలుగొండలో కోట్లాది రూపాయాలతో నిర్మించిన నూతన పోలీసు స్టేషన్ల భవనాలను స్పీకర్, డీజీపీ ప్రారంభిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు చిటికెల తారకవేణుగోపాల్, ఎంఈవో-2 కృష్ణప్రసాద్, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ లగుడు రాజులునాయుడు, టీడీపీ నేత లగుడు రమేశ్ పాల్గొన్నారు.

వైద్య సేవలపై టాస్క్‌ఫోర్స్ బృందం తనిఖీలు


వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న డీపీఎంవో

బుచ్చెయ్యపేట, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్.శివరాంపురం ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ టాస్క్‌ఫోర్స్ బృందం సభ్యులు శుక్రవారం సందర్శించారు. కేంద్రంలో రికార్డులు పరిశీలించారు. గర్భిణులు, కౌమారదశ, బాలికల ఇళ్లకు వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్యం సేవలు అందిస్తున్న తీరుపై సిబ్బందితో మాట్లాడి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డీపీఎంవో ప్రశాంతి, జిల్లా స్టాటికల్ అధికారి ఎ.రామచంద్రరావు, సిబ్బంది జగదీశ్, రాజశేఖర్, రమణమ్మ పాల్గొన్నారు.

గరిష్ఠ స్థాయిలో కల్యాణపులోవ నీటి మట్టం

రావికమతం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): కల్యాణపులోవ జలాశయ నీటి మట్టం గరిష్ఠ స్థాయికి చేరుకుంది. దీంతో రెండు గేట్లు ఎత్తి అదనపు నీటిని విడిచిపెట్టారు. సర్పానదిని ఆనుకుని మూడు మండలాల ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని ఈ సందర్భంగా ఏఈ డి.సూర్య తెలిపారు. రిజర్వాయర్ సామర్థ్యం 460 అడుగులు కాగా, శుక్రవారం నాటికి 458.4 అడుగులకు చేరిందని చెప్పారు. గరు, శుక్రవారాల్లో రెండు గేట్లు ఎత్తి 200 క్యూసెక్కుల అదనపు నీటిని సర్పా నదిలోకి విడిచి పెట్టామని ఆయన చెప్పారు.

రైతులు ఇబ్బంది పడకుండా ధాన్యం సేకరణ: కలెక్టర్ విజయకృష్ణన్

అనకాపల్లి కలెక్టరేట్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం సేకరణ విషయంలో రైతులు ఎటువంటి ఇబ్బంది పడకుండా చూడాలని కలెక్టర్ విజయకృష్ణన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జేసీ ఎం.జాహ్నవితో కలిసి జిల్లాస్థాయి ధాన్యం సేకరణ సమన్వయ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డివిజన్, మండలస్థాయి అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర ప్రకారం కామన్ రకం అయితే క్వింటా రూ.2,369, ఏ గ్రేడ్ రకం అయితే రూ2,389 కొనుగోలు చేయాలని చెప్పారు. ధాన్యం కొనుగోలుకన్నా ముందే ఈ-పంట, ఈ-కేవైసీ నమోదు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. మండల స్థాయిలో ధాన్యం కొనుగోలు కమిటీ ఏర్పాటు చేసి నిరంతర పర్యవేక్షణ చేయాలన్నారు. జిల్లా పౌరసరఫరాల మేనేజర్ జయంతి పాల్గొన్నారు.

కాలనీ ఇళ్లు పురోగతికి కృషి

హౌసింగ్ ఈఈ శ్రీనివాస్



నర్సీపట్నం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): కాలనీ ఇళ్ల నిర్మాణాల పురోగతికి కృషి చేస్తానని గృహ నిర్మాణ శాఖ ఈఈ ఎన్.శ్రీనివాస్ అన్నారు. పల్నాడు జిల్లా వినుకొండలో హౌసింగ్ డీఈఈగా పని చేసిన ఆయన ఈఈగా పదోన్నతి పై నర్సీపట్నం వచ్చారు. ఇక్కడ ఈఈగా పని చేసిన ఈ సందర్భంగా ప్రభుత్వం నిర్ధేసించిన మేరకు నిర్మాణాలు వేగవంతంగా పూర్తి చేయడానికి కృషి చేస్తానని ఆయన చెప్పారు. ఇక్కడ ఈఈగా పని చేసిన కె. నీరజ జూన్‌లో ఉద్యోగ విరమణ చేశారు.

జగన్ పర్యటనను జయప్రదం చేయాలి

మాకవరపాలెం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): భీమబోయినపాలెంలో మెడికల్ కాలేజీ పరిశీలన కోసం ఈ నెల 9న వస్తున్న మాజీ సీఎం జగన్ పర్యటనను విజయవంతం చేయాలని రాష్ట్ర వైసీపీ ప్రోగామ్స్ కన్వీనర్ టి.రఘురాం పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం వైసీపీ బృందం సభ్యులు మెడికల్ కాలేజీని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాలేజీ నిప్రవేటు పరం చేస్తే ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఉత్తరాంధ్ర వైసీపీ రీజనల్ కోఆర్డినేటర్ కురసాల కన్నబాబు, మాజీ మంత్రి అమనాథ్, మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేశ్, అనకాపల్లి పార్లమెంటు సమన్వయకర్త బి.ప్రసాద్, విశాఖపట్నం వైసీపీ అధ్యక్షుడు కేకే రాజు, పార్టీ మండల అధ్యక్షుడు చిటికల రమణ పాల్గొన్నారు

కాంట్రాక్టు విద్యుత్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

చోడవరం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల సమసలు పరిష్కరించాలని జిల్లా స్ట్రగుల్ కమిటీ అధ్యక్షుడు వేపాడ సత్యనారాయణ కోరారు. ఈ మేరకు 5న విజయవాడలో నిర్వహిస్తున్న రౌండ్ టేబుల్ సమావేశాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో 27 వేల మంది కాంట్రాక్టు కార్మికులు కేవలం తక్కువ వేతనాలతో సేవలందిస్తున్నారని, దశాబ్దాలుగా పనిచేస్తున్న వీరందరినీ కూటమి ప్రభుత్వం ఆదుకొని వారిని రెగ్యులర్ చేయాలని ఆయన కోరారు.

నేడు మండల సమావేశం

మాకవరపాలెం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో శనివారం సర్వసభ్య సమావేశం నిర్వహిస్తామని ఎంపీడీవో చాయిసుధ తెలిపారు. ఎంపీపీ అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశానికి ప్రజా ప్రతినిధులు, అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని ఆమె సూచించారు.

రీ సర్వేలో రికార్డులు సరిచేసుకోండి

రోలుగుంట, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం రీ సర్వే ద్వారా దొరుకుతుందని, రికార్డులు సరిచేసుకోవాలని తహశీల్దార్ నాగమ్మ సూచించారు. శుక్రవారం నిండుగొండలో గ్రామ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిండుగొండ రెవెన్యూలో 1850 ఎకరాల భూమి ఉందన్నారు. పక్కాగా చేపట్టే ఈ రీసర్వేలో రైతులంతా తమ భూముల రికార్డులను సరిచేసుకోవడానికి సహకరించాలని కోరారు. మూడు నెలల పాటు నిర్వహించే సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి భూముల నవీకరణకు చర్యలు చేపట్టనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శెట్టి సంధ్య, పోతల రాజశేఖర్, సర్వేయర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వాసవీ కల్యాణ మండపం నూతన కార్యవర్గం

నర్సీపట్నం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వాసవీ కల్యాణ మండపం నూతన కార్యవర్గం ఎంపిక ఏకగ్రీవంగా జరిగింది. శుక్రవారం జరిగిన కార్యవర్గం సర్వసభ్య సమావేశంలో అధ్యక్షుడిగా జేవీఎస్ఎన్ జోగారావు, కార్యదర్శిగా పద్మనాభుని కన్నయ్యశెట్టి, ట్రెజరర్‌గా ఊడా సూర్యారావు, ఉపాధ్యక్షులుగా తాటికొండ సీతారం, సుతాపల్లి చైతన్యకుమార్, సంయుక్త కార్యదర్శిగా బి.వెంకటరామ శేషు, తాటికొండ హేమంత్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని పూర్వపు అధ్యక్ష కార్యదర్శులు బంగార్రాజు, వి.నారాయణరావు తెలిపారు.


బీజాపూర్ జిల్లాలో లొంగిపోయిన మావోయిస్టులు

ఛత్తీస్‌గఢ్‌లో ఇద్దరు గిరిజనుల హత్య

» మావోయిస్టుల ఘాతుకం

» బీజాపూర్ జిల్లాలో లొంగిపోయిన 103మంది మావోయిస్టులు

చర్ల, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్, సుకుమా జిలాల్లో మావోయిస్టులు ఇద్దరు గిరిజనులను హత్య చేశారు. బీజాపూర్ జిల్లా పూజారి కాంకేర్ గ్రామానికి చెందిన మడకం భీమా(45)ను మావోయిస్టులు గురువారం అతని ఇంటి ఆవరణలోనే దారుణంగా కత్తులతో పొడిచి చంపేశారు. భీమా 2018లో తెలంగాణలోకి వెళ్లిపోయి, ములుగు జిల్లాలో ఓ ఎస్ఐతో కలిసి పని చేశాడని, గ్రామంలో పోలీస్ క్యాంప్ పెట్టిన తరువాత తిరిగి వచ్చి, ప్రజలను బెదిరిస్తూ, రూ.లక్షలు దోచుకుంటున్నాడని, భూములు ఆక్రమిస్తున్నాడని అందుకే హత్య చేశామని మావోయిస్టులు ఓ లేఖలో పేర్కొన్నారు. అలాగే సుకుమా జిల్లా కిష్టారం అడవుల్లో ఓ గిరిజనుడిని మావోయిస్టులు హతమార్చారు. ఇదిలా ఉంటే ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం గంగలూరు అడవుల్లో గురువారం సాయంత్రం ఎన్‌కౌంటర్ జరిగింది. ఒక మావోయిస్టు చనిపోయాడు. మరోవైపు, బీజాపూర్ జిల్లా పోలీసులు ఎదుట గురువారం 103 మంది మావోయిస్టు పార్టీ సభ్యులు లొంగిపోయారు. వీరిలో 22 మంది మహిళలున్నారు. లొంగి పోయిన వారిలో 47మందిపై మొత్తం కలిపి రూ.1.06కోట్ల రివార్డులున్నట్టు ఎస్పీ జితేంద్ర యాదవ్ తెలిపారు. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటివరకు 421మంది మావోయిస్టులు అరెస్టయ్యారని, 410 మంది లొంగి పోయారని, 137 మంది ఎన్‌కౌంటర్లలో మృతి చెందారని వెల్లడించారు.

అసభ్య పోస్టుల కేసులో అంజద్ బాషా పీఏ అరెస్టు

» కడప కోర్టులో హాజరు.. బెయిల్ మంజూరు

కడప క్రైం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): కడప ఎమ్మెల్యే ఆర్.మాధవిపై అసభ్య పదజాలంతో ఉన్న వీడియోను సోషల్ మీడియాలో పోస్టు చేసిన కేసులో మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా పీఏ షేక్ మహ్మద్‌ఖాజాను పోలీసులు అరెస్టు చేశారు. గురువారం అతన్ని కడప ఎక్సైజ్ కోర్టులో హాజరు పరచగా.. సొంత పూచీకత్తుపై అతనికి కోర్టు బెయిలు మంజూరు చేసింది. ఆ వివరాలను కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు, వన్‌టౌన్ సీఐ రామకృష్ణ విలేకరులకు వివరించారు. కడప అక్బర్ వీధికి చెందిన షేక్ మహ్మద్ ఖాజా మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషాకు పీఏగా పనిచేస్తున్నాడు. 2024 ఎన్నికల సమయంలో ప్రస్తుత కడప ఎమ్మెల్యే మాధవి, ఆమె భర్త శ్రీనివాసరెడ్డిపై కడప అలంఖాన్‌పల్లెకు చెందిన విజయలక్ష్మి అసభ్యకరంగా మాట్లాడారు. ఆ వీడియోను అంజద్‌బాషా అతని సోదరుడు అహ్మద్‌బాషా ప్రోద్బలంతో సోషల్ మీడియాలో షేక్ మహ్మద్‌ఖాజా పోస్టు చేశాడు. ఈ వీడియో వైరల్ కావడంతో టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి ఫిర్యాదు మేరకు అంజద్‌బాషా, అహ్మద్‌బాషా, షేక్ మహ్మద్‌ఖాజాలపై కేసు నమోదు చేశారు. షేక్ మహ్మద్ ఖాజాను బుధవారం హైదరాబాద్‌లో అదుపులోకి తీసుకున్నారు. గురువారం కోర్టులో హజరు పరిచారు. ఎవరైనా సోషల్ మీడియాలో అసభ్యకరమైన వీడియోలు పోస్టు చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా పోలీసులు హెచ్చరించారు.

'సిట్' ముందు హాజరైన మిథున్‌రెడ్డి

విజయవాడ, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణంలో నిందితుడిగా ఉన్న రాజంపేట ఎంపీ పీవీ మిథున్‌రెడ్డి విజయవాడలోని సిట్ అధికారుల ముందు శుక్రవారం హాజరయ్యారు. ప్రతి సోమవారం, శుక్రవారం సిట్ అధికారుల ముందు హాజరవ్వాలని కోర్టు బెయిల్ ఉత్తర్వుల్లో షరతు విధించింది. దాని ప్రకారం మిథున్‌రెడ్డి సిట్ కార్యాలయానికి వచ్చి పుస్తకాల్లో సంతకం చేశారు. ఇటీవలే ఆయనకు కోర్టు బెయిల్ మంజూరు చేయడంతో రాజమహేంద్రవరం కేంద్ర కారాగారం నుంచి విడుదలైన విషయం తెలిసిందే.


సర్జరీ సిస్టమ్‌ను ప్రారంభిస్తున్న సత్యసాయి సెంట్రల్ ట్రస్టు సభ్యుడు చక్రవర్తి, పక్కన సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్జే రత్నాకర్ తదితరులు

'సత్యసాయి' ఆస్పత్రిలో రోబోటిక్ సర్జరీ సేవలు

» గుండె, యూరాలజీ విభాగంలో అందుబాటులోకి సేవలు

పుట్టపర్తి రూరల్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తిలోని సత్యసాయి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో అత్యాధునికి రోబోటిక్ సర్జరీ సేవలు అందుబాటులోకి వచ్చాయి. రూ.8 కోట్ల విలువైన అత్యాధునిక రోబోటిక్ సర్జరీ వ్యవస్థను సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్జే రత్నాకర్, సభ్యుడు చక్రవర్తి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రత్నాకర్ మాట్లాడుతూ, భగవాన్ సత్యసాయి ధ్యేయమైన విలువలు, కరుణ, ప్రేమతో కూడిన అత్యాధునిక వైద్యాన్ని ఉచితంగా అందుబాటులోకి తెచ్చామన్నారు. ఎస్ఎస్ ఇన్నొవేషన్స్ అనే భారతీయ సంస్థ ప్రపంచ స్థాయి ప్రమాణాలకు తగ్గట్లు ఈ రోబోటిక్ శస్త్ర చికిత్స వ్యవస్థను అభివృద్ధి చేసిందన్నారు. ఈ వ్యవస్థతో శరీరంలోని సున్నితమైన ప్రాంతాలకు కూడా అత్యంత కచ్చితత్వంతో, సంక్లిష్టమైన శస్త్ర చికిత్సలను సులభతరంగా చేయవచ్చని వెల్లడించారు. రోబోటిక్ సర్జరీకి రూ.లక్షలు ఖర్చు అవుతుందని, కానీ సత్యసాయి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో పూర్తి ఉచితంగా అందుతుందని స్పష్టం చేశారు.


రోబోటిక్ సర్జరీ యంత్రాలు

ములకలచెరువు కేంద్రంగా

నకిలీ మద్యం తయారీ

» రూ.1.75 కోట్ల విలువైన నకిలీ మద్యం స్వాధీనం

» స్పిరిట్, బాటిళ్లు, పరికరాలు సీజ్.. 9 మంది అరెస్టు


నకిలీ మద్యాన్ని తయారు చేస్తున్న దృశ్యం.. స్వాధీనం చేసుకున్న నకిలీ మద్యం బాక్సులు

రాయచోటి, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా ములకలచెరువులో శుక్రవారం ఎక్సైజ్ అధికారులు దాడులు జరిపి రూ.1.75కోట్ల విలువైన నకిలీ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. కడప ప్రొహిబిషన్, ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ దాడులు జరిగాయి. అనంతరం ఆయన మీడియాకు వివరాలు వెల్లడించారు. విజయవాడకు చెందిన జనార్దన్‌రావు, ఆయన అనుచరుడు రాజు ములకలచెరువుకు సమీపంలోని కనుగొండ ఆర్చి సమీపంలో ఉన్న పాత డాబాను అద్దెకు తీసుకుని నకిలీ మద్యం తయారు చేస్తున్నారు. ఈ మద్యాన్ని వాహనం ద్వారా తంబళ్లపల్లె నియోజకవర్గంలోని పలు ప్రాంతాలకు సరఫరా చేస్తున్నారు. ప్రభుత్వ ధర కంటే తక్కువకే ఇస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. పలు ప్రభుత్వ మద్యం షాపులకు కూడా ఈ మద్యాన్ని సరఫరా చేస్తున్నారు. ఇటీవల జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పెద్దతిప్ప సముద్రం మండలంలో తనిఖీలు నిర్వహిస్తూ.. నకిలీ మద్యం తీసుకెళ్తున్న వాహనాన్ని నిలిపారు. బాటిళ్ల మీద ఉన్న లేబుల్‌ను స్కాన్ చేశారు. అయితే స్కాన్ కాకపోవడంతో అనుమానం వచ్చి విషయాన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ వ్యవహారంపై ఎక్సైజ్ డైరెక్టర్ రాహుల్ దేవ్‌కు ఫిర్యాదులు అందడంతో అధికారులు గత నాలుగు రోజులుగా నిఘా ఉంచి శుక్రవారం ఈ దాడులు చేశారు. 15 వేల నకిలీ మద్యం బాటిళ్లు, 1050 లీటర్ల స్పిరిట్ క్యాన్లు, 1500 లీటర్ల బ్లెండ్(తయారైన నకిలీ మద్యం), 10 వేల ఖాళీ మద్యం బాటిళ్లు, 4 వేల మద్యం సీసా మూతలు.. స్టిక్కర్లు, మద్యం బాటిళ్లు తయారు చేసే పరికరాలు, ఇతర సామగ్రి, నకిలీ మద్యం సరఫరా చేసే వాహనాన్ని సీజ్ చేశారు. తమిళనాడు రాష్ట్రం కృష్ణగిరికి చెందిన మరిమారన్, తిరుపత్తూరుకు చెందిన సురేశ్, సూర్య, అనందన్, ఒడిశా రాష్ట్రం బ్రహ్మపూర్‌కు చెందిన ఆనంద్ దాస్, మిథున్, విశాఖపట్నానికి చెందిన స య్యద్ అలీ, వాహన డ్రైవర్ బాలరాజు, నకిలీ మద్యం కలిగి ఉన్న బెల్ట్ షాపు నిర్వాహకుడు రంగసముద్రానికి చెందిన నాగరాజు, పెద్దతిప్ప సముద్రంలోని మద్యం దుకాణ నిర్వాహకుడు టీడీపీ నేత కట్టా సురేంద్రనాయుడును అరెస్టు చేశారు. విజయవాడకు చెందిన జనార్దన్‌రావు, అతని అనుచరుడు రాజు, ములకలచెరువులోని రాక్‌స్టార్ ప్రభు త్వ మద్యం దుకాణ నిర్వాహకుడు రాజేశ్ తదితరులపైనా కేసు నమోదు చేశారు.

నిందితుల్లో తంబళ్లపల్లె టీడీపీ ఇన్‌చార్జి పీఏ


సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి

రాజేశ్ తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి దాసరిపల్లి జయచంద్రారెడ్డి పీఏగా పనిచేస్తున్నారు. ఇతని పేరుతో ఉన్న వాహనం ద్వారానే నకిలీ మద్యం సరఫరా చేస్తున్నారు. దీనిపై సర్వత్రా చర్చ జరుగుతోంది. ఈ నకిలీ మద్యం తయారీ వెనుక తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ ముఖ్య నాయకుల సమీప బంధువుల ప్రమేయం ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. ఈ నకిలీ మద్యం తయారీలో జిల్లాలోని పలువురు టీడీపీ నాయకుల హస్తం ఉన్నట్టు కూడా ఆరోపణలు వినిస్తున్నాయి. నియోజకవర్గంలోని పలు బెల్ట్‌షాపులు, ప్రభుత్వ మద్యం దుకాణాల్లోనూ ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు.

గ్యాంగ్ రేప్ కేసు నిందితులకు రిమాండ్

» గత నెల 25న చిత్తూరు సమీపంలో బాలికపై అఘాయిత్యం

చిత్తూరు అర్బన్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): ఇటీవల చిత్తూరులో ఇంటర్ విద్యార్థినిపై గ్యాంగ్ రేప్‌కు పాల్పడిన ముగ్గురు యువకులను పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను డీఎస్పీ సాయినాథ్ మీడియాకు వివరించారు. గత నెల 25వ తేదీన చిత్తూరు నగర సమీపంలో ఉన్న నీవా నగర వనం పార్కుకు వచ్చిన యువ జంటను ముగ్గురు యువకులు బెదిరించారు. బాలికపై అత్యాచారానికి పాల్పడ్డారు. ఆ జంటలోని యువకుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు 29వ తేదీన పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో నిందితులైన మహేష్, కిశోర్, హేమంత్‌ను శుక్రవారం అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. ముగ్గురు నిందితులకు పోక్సో కోర్టు ఈ నెల 16 వరకు రిమాండ్ విధించింది. నిందితుల్లో ఒకరైన మహేష్ ఓ బాలికను ఈవ్ టీజింగ్ చేసిన కేసులో నిందితుడిగా ఉన్నాడు. కిశోర్ 2022లో నగరంలోని ఓ వైన్ షాపులో పనిచేస్తుండగా అక్కడి మద్యాన్ని బ్లాక్‌లో విక్రయించాడని అతనిపై కేసు నమోదైంది. కాలక్షేపం కోసం పార్కులకు వచ్చే ప్రేమ జంటలను లక్ష్యంగా చేసుకుని వారు కలిసున్న దృశ్యాలను వీడియో తీసి వారిని బెదిరించడం.. వారి వద్ద ఉన్న నగదు, బంగారాన్ని లాక్కోవడం.. లైంగిక వేధింపులకు పాల్పడటం.. వీరి నేర ప్రవృత్తిగా పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. కాగా.. నిందితుల్ని స్థానిక డీపీవో కార్యాలయం నుంచి అర కిలో మీటరు దూరంలో ఉన్న కోర్టు వరకు బేడీలు వేసి రోడ్డుపై నడిపించుకుంటూ తీసుకెళ్లారు.

హోటల్ సిబ్బందిపై వైసీపీ నేత నాగార్జున యాదవ్ దాడి

» అల్పాహారం ఆలస్యంగా ఇచ్చారని దౌర్జన్యం

» ఇరువురికి గాయాలు.. కేసు నమోదు


హోటల్ యజమాని కొడుకు ప్రేమ్‌కుమార్

సత్తెనపల్లి, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): అల్పాహారం తీసుకురావడంలో ఆలస్యం అయిందని హోటల్ యజమాని, సిబ్బందిపై వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి యనమల నాగార్జున యాదవ్ అతని అనుచరులు రెచ్చిపోయారు. వారిపై దాడి చేసి గాయపర్చారు. ఈ దాడి ఘటన గురువారం రాత్రి పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని తాలూకాసెంటర్‌లో జరిగింది. రాత్రి 10 గంటల సమయంలో నాగార్జున యాదవ్ అతని అనుచరులు పట్టణంలోని గుడ్‌మార్నింగ్ హోటల్‌కు టిఫిన్ చేసేందుకు వచ్చారు. టిఫిన్ అందించడం ఆలస్యమవుతుందని నాగార్జునయాదవ్ అతని అనుచరులు గొడవకు దిగారు. హోటల్ యజమాని శేఖర్, అతని కుమారుడు ప్రేమ్‌కుమార్, వర్కర్ నాగేశ్వరరావుపై దాడి చేశారు. ఈ ఘటనలో ప్రేమ్‌కుమార్, వర్కర్‌కు గాయాలయ్యాయి. తనతో పెట్టుకుంటే అబ్బూరు ఊరు ఊరంతా కదిలొస్తుందంటూ హోటల్ యజమాని శేఖర్‌ను నాగార్జున యాదవ్ బెదిరించారు. దాడి ఘటనపై హోటల్ యజమాని శేఖర్ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.


హోటల్ యజమానిపై దౌర్జన్యం చేస్తున్న వైసీపీ నాయకుడు యనమల నాగార్జునయాదవ్

నూకాంబికను దర్శించుకున్న మూడు జిల్లాల కలెక్టర్లు


నూకాంబికను దర్శించుకున్న కలెక్టర్లు విజయకృష్ణన్, దినేశ్‌కుమార్, హరేంధిర ప్రసాద్

అనకాపల్లి టౌన్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): విజయదశమి సందర్భంగా స్థానిక నూకాంబిక అమ్మవారిని మూడు జిల్లాల కలెక్టర్లు దర్శించుకున్నారు. గురువారం బాలాలయంలో అమ్మవారిని అనకాపల్లి, అల్లూరి జిల్లాల కలెక్టర్లు వి జయకృష్ణన్, ఏఎస్ దినేశ్‌కుమార్ దంపతులు, విశాఖ జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ దర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ ఇన్‌చార్జి ఈవో కేఎల్ సుధారాణి, మాజీ చైర్మన్ పీలా నాగశ్రీను.. అమ్మవారి ప్రసాదాన్ని అందజేసి సత్కరించారు.

గూగుల్‌ను అడ్డుకొనేందుకు వైసీపీ కుట్ర

» టీడీపీ జిల్లా అధ్యక్షుడు తాతయ్యబాబు ధ్వజం


మాట్లాడుతున్న బత్తుల తాతయ్యబాబు

అనకాపల్లి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి గూగుల్ డేటా సెంటర్ రాకుండా వైసీపీ నాయకులు కుట్రలు చేస్తున్నారని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు ఆరోపించారు. శుక్రవారం ఇక్కడ పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ, రాష్ట్రానికి అనేక పెద్ద కంపెనీలు తీసుకొచ్చేందుకు సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం తీవ్రంగా కృషి చేస్తున్నదని అన్నారు. ఐటీ శాఖ మంత్రి లోకేశ్ కృషితో సుమారు రూ.50 వేల కోట్ల పెట్టుబడితో అతిపెద్ద డేటా సెంటర్ ఏర్పాటుకు గూగుల్ సంస్థ ముందు వచ్చిందన్నారు. దీనికోసం భీమిలి నియోజకవర్గంలో రైతుల నుంచి 200 ఎకరాలు సేకరించాలని ప్రభుత్వం నిర్ణయించగా, దానిని అడ్డుకునేందుకు రైతుల పేరుతో కోర్టులో కేసులు వేశారని ఆయన ఆరోపించారు. కాగా టీసీఎస్ ప్రతినిధులు రాష్ట్రానికి రాకుండా వైసీపీ నాయకులు అనేక ప్రయత్నాలు చేయడం సిగ్గుచేటన్నారు. టీసీఎస్‌కు నామమాత్రపు లీజుకు భూములు కేటాయించడంపై వైసీపీ నేతలు కోర్టులో పిటిషన్ వేసి, మొట్టికాయలు తిన్నారని ఎద్దేవా చేశారు.

నిత్య విద్యార్థులుగా ఉపాధ్యాయులు

» ఆర్జేడీ ఉదయభాస్కర్

» డీఎస్సీ-2025 టీచర్లకు డీఎస్ఎన్ఎల్‌యూలో శిక్షణ ప్రారంభం


మాట్లాడుతున్న ఆర్జేడీ విజయభాస్కర్

సబ్బవరం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు నిత్య విద్యార్థులుగా ఉండాలని విద్యా శాఖ జోన్-1 ఆర్జేడీ ఉదయభాస్కర్ అన్నారు. స్థానిక దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం (డీఎస్ఎన్ఎల్‌యూ)లో 2025 డీఎస్సీలో ఎంపికైన ఉపాధ్యాయలకు ఎనిమిది రోజులపాటు నిర్వహించే శిక్షణ కార్యక్రమాన్ని ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నిత్యం కొత్త విషయాలపై అధ్యయనం చేస్తూ, వాటిని విద్యార్థులకు వివరించి వారిని అన్ని అంశాల్లో నిష్ణాతులుగా తీర్చిదిద్దాలని ఉద్బోధించారు. కూటమి ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన డిఎస్సీ-2025కు ఎంపికైన ఉపాధ్యాయలు ప్రభుత్వ లక్ష్యాలు నెరవేరేలా పని చేయాలని సూచించారు. అనకాపల్లి డీఈవో గిడ్డి అప్పారావు నాయుడు మాట్లాడుతూ, ఉన్నత ప్రమాణాలతో చక్కగా విద్యా బోధన చేస్తూ అటు ప్రభుత్వానికి, ఇటు పని చేస్తున్న పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఈవో అప్పారావు అకడమిక్ మానిటరింగ్ అధికారి కేజియా, ఎంఈవో-2 ఎంజే రవీంద్రబాబు, సీఆర్‌పి కె.మాధవి తదితరులు పాల్గొన్నారు.

ఇస్కాన్‌లో ఘనంగా దసరా సంబరాలు



విశాఖపట్నం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): ఇస్కాన్‌లో గురువారం దసరా సంబరాలు వైభవంగా జరిగాయి. ఉదయం సీతారామ,లక్ష్మణ, హనుమన్‌లకు ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం దుష్ట శిక్షణ, శిష్ట రక్షణలో భాగంగా ఏర్పాటుచేసిన 50 అడుగుల రావణాసురుడి దిష్టిబొమ్మను ఎంపీ ఎం.శ్రీభరత్, ఇస్కాన్ అధ్యక్షుడు సాంబదాసు దహనం చేశారు. ఈ సందర్భంగా ఎంపీ శ్రీభరత్ విల్లు ఎక్కుపెట్టి రావణ దిష్టిబొమ్మకు శరసంధానం చేశారు. సంబరాల్లో భాగంగా ఏర్పాటుచేసిన ప్రత్యేక ఫైర్ క్రాకర్స్ షో, సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. రామలీలపై చేసిన ప్రవచనం పరవశులను చేసింది. వేలాదిగా తరలివచ్చిన భక్తులతో ఇస్కాన్ ప్రాంగణం కిక్కిరిసిపోయింది.

స్వచ్ఛాంధ్ర పురస్కారాలు

... 5వ పేజీ తరువాయి

కలెక్టర్ ఆఫీసు, ఎస్పీ ఆఫీసు, జిల్లా పంచాయతీ కార్యాలయాలు స్వచ్ఛ ఆంధ్రా అవార్డులు సాధించాయి. రావికమతం మండలం కొత్తకోట పీహెచ్‌సీ, అనకాపల్లి జిల్లా ఆస్పత్రి, జీపీడీ ఆస్పత్రికి స్వచ్ఛ అవార్డులకు ఎంపియ్యాయి. కశింకోట సోషల్ వెల్ఫేర్ ఇంటిగ్రేటెడ్ బాలికల వసతిగృహం, నర్సీపట్నం బీసీ బాలుర వసతిగృహం, మాడుగుల మండలం తాటిపర్తి గిరిజన సంక్షేమ శాఖ బాలికల వసతిగృహం స్వచ్ఛ హాస్టళ్ల అవార్డులకు ఎంపికయ్యాయి. స్వచ్ఛ ఎన్‌జీవోగా తుమ్మపాలకు చెందిన శారదా వ్యాలీ డెవలప్‌మెంట్ సొసైటీ, స్వచ్ఛ బస్ స్టేషన్ అవార్డు నాతవరం బస్‌స్టేషన్, స్వచ్ఛ రెసిడెన్షియల్ స్కూల్ అవార్డుకు నర్సీపట్నం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల ఎంపికయ్యాయి. స్వచ్ఛ పరిశ్రమగా (ఎంఎస్ఎంఈ) మౌల్డ్ టెక్ ప్యాకేజింగ్ లిమిటెడ్ ఎంపికైంది. ఎలమంచలి మండలం సీతారామ స్లమ్ సమాఖ్య, శ్రీసాయి బాబా స్లమ్ సమాఖ్యలు స్వచ్ఛ ఎస్ఎల్ఎఫ్ అవార్డుకి ఎంపికైయ్యాయి.

నాడు...నేడు అదే తీరు!

... 5వ పేజీ తరువాయి

అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి.

గత ప్రభుత్వం నాడు-నేడు కార్యక్రమం కింద చేపట్టి, అసంపూర్తిగా వున్న భవనాల నిర్మాణం, ఇతర పనులపై దసరా సెలవులకు ముందు ప్రభుత్వం ఒక నిర్ణయం తీసుకుంటుందని విద్యాశాఖ అధికారులు భావించారు. కానీ ఎటువంటి ప్రకటన వెలువడకపోవడంతో ఇప్పట్లో వాటికి మోక్షం లభించేలా లేదు. ఆయా పాఠశాలల్లో వసతి కొరత కారణంగా విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. దీనిపై సమగ్ర శిక్ష ఏపీసీ జయప్రకాశ్‌ను 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధి వివరణ కోరగా.. కూటమి ప్రభుత్వం పాఠశాలలకు గ్రేడింగ్‌లు ఇచ్చి, ఆ మేరకు ప్రాధాన్యతా క్రమంలో దశల వారీగా నిర్మాణాలు పూర్తి చేసేందుకు నిధులు మంజూరు చేయనుందని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన పనులు కాకుండా కేజీబీవీలు, ఇతర పాఠశాలల్లో కొత్తగా నిర్మాణాలు చేపట్టనున్నట్టు పేర్కొన్నారు.

ఆర్టీసీకి దసరా ధమాకా

... 5వ పేజీ తరువాయి

గత 24, 25 తేదీల్లో 105 శాతం ఓఆర్ వచ్చింది. అలాగే 26వ తేదీన 95 శాతం, 27వ తేదీన 110శాతం, 28వ తేదీన 95 శాతం, 29వ తేదీన 98 శాతం, 30వ తేదీన 90 శాతం, ఈ నెల ఒకటో తేదీన 105 శాతం, రెండో తేదీన 87 శాతం ఓఆర్ వచ్చింది. నర్సీపట్నం డిపో నుంచి నడిచే బస్సుల్లో తొమ్మిది రోజుల్లో 3,20,792 మంది ప్రయాణించారు. వీరిలో స్త్రీశక్తి పథకం కింద ఉచితంగా ప్రయాణించిన వారు 1,96,401 మంది వుండగా, టికెట్ తీసుకొని ప్రయాణించిన వారు 1,24,391 మంది ఉన్నారు. తొమ్మిది రోజుల్లో నర్సీపట్నం డిపోకి రూ.1.55 కోట్ల ఆదాయం వచ్చిందని అధికారులు వెల్లడించారు.

క్రైం... crime news

విద్యుదాఘాతంతో ఎలక్ట్రిషియన్ మృతి

అనకాపల్లి టౌన్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతానికి గురై ఒక ఎలక్ట్రిషియన్ మృతిచెందాడు. పట్టణ ఏఎస్ఐ రామ్‌కుమార్ అందించిన వివరాల ప్రకారం.. తుమ్మపాల పం చాయతీ మధురానగర్‌కు చెందిన ఉండ్రు నూకరాజు (40) ఎలక్ట్రిషియన్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. స్థానిక గాంధీబొమ్మ జంక్షన్‌లోని ఒక క్లాత్ సెంటర్ పునర్నిర్మాణ పనుల్లో భాగంగా బుధవారం సాయంత్రం ఎలక్ట్రికల్ పనులు చేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. అక్కడ వున్న వారు వెంటనే ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు చెప్పారు. నూకరాజు భార్య రాధా వెంకటలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్ఐ రామ్‌కుమార్ తెలిపారు.

చెట్టును ఢీకొన్న ద్విచక్రవాహనం.. యువకుడి మృతి

ఎలమంచిలి, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీ పరిధిలోని కట్టుపాలెం సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు మృతిచెందాడు. ఎలమంచిలి రూరల్ పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. రాంబిల్లి మండలం నారాయణపురం గ్రామానికి చెందిన బత్తిన చంద్రశేఖర్ (21) దసరా పండుగను పురస్కరించుకుని గురువారం ఇక్కడ ఒక ఆటో మొబైల్ షోరూమ్‌లో కొత్త ద్విచక్ర వాహనాన్ని కొనుగోలు చేశాడు. అనంతరం మునిసిపాలిటీ పరిధిలోని కట్టుపాలెంలో వున్న తన స్నేహితుడిని కలిసేందుకు వెళుతుండగా దారిలో వాహనం అదుపుతప్పి చెట్టును ఢీకొన్నాడు. తీవ్ర గాయాలు కావడంతో స్థానిక సీహెచ్‌సీకి తరలించి చికిత్స చేశారు. పరిస్థితి విషమంగా వుండడంతో విశాఖ కేజీహెచ్‌కు పంపారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. పోలీసులుకేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

9న మాజీ సీఎం జగన్ రాక


మీడియాతో మాట్లాడుతున్న కన్నబాబు. పక్కన గుడివాడ అమర్, బూడి ముత్యాలనాయుడు, పెట్ల గణేశ్

అనకాపల్లి టౌన్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఈ నెల తొమ్మిదో తేదీన జిల్లాకు రానున్నారని వైసీపీ ఉత్తరాంధ్ర సమన్వయకర్త కె.కన్నబాబు చెప్పారు. శుక్రవారం ఇక్క పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మాకవరపాలెం మండలంలో నిర్మాణంలో వున్న వైద్య కళాశాల భవనాలను పరిశీలిస్తారని చెప్పారు. కూటమి ప్రభుత్వం జగన్మోహన్‌రెడ్డిపై కక్ష పూరితంగా వ్యవహరిస్తూ, ఆయన మంజూరు చేసిన మెడికల్ కళాశాలలను ప్రైవేటు పరం చేసేందుకు ప్రయత్నిస్తున్నదని ఆరోపించారు. అమరావతి అభివృద్ధిపై చూపిస్తున్న శ్రద్ధ, కొత్త మెడికల్ కళాశాలలు ప్రభుత్వ ఆధీనంలో నడిపించేందుకు ఎందుకు చూపడం లేదని ప్రశ్నించారు. మీడియా సమావేశంలో వైసీపీ నేతలు బూడి ముత్యాలనాయుడు, గుడివాడ అమర్‌నాథ్, పెట్ల ఉమాశంకర్ గణేశ్, బొడ్డేడ ప్రసాద్, బీవీ సత్యవతి, తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	120.00
లైవ్ ధర	140.00
విత్ స్కిన్	250.00
స్కిన్ లెస్	260.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	510
విజయనగరం	514
శ్రీకాకుళం	514